1
నవతెలంగాణ
ఆదిలాబాద్
గురువారం | మే 23, 2024 | www.navatelangana.com

## పీహెచ్‌సీ తనిఖీ చేసిన మలేరియా అడిషనల్ డైరెక్టర్

నవతెలంగాణ-లోకేశ్వరం



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్, మలేరియా అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ శిరీష బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలోని మైక్రో ఫైలేరియా స్లైడ్లను పరిశీలించారు. మలేరియా వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, ఏఎన్ఎంలు స్వప్న, మరియా, ఆయుష్ రమణ పాల్గొన్నారు.

## వరి ధాన్యం కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-ఖానాపూర్



వరి ధాన్యం కేంద్రాలను బుధవారం నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ పరిశీలించారు. ఖానాపూర్ మండలంలోని బాదనకుర్తి, మస్కాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కేంద్రాలను పరిశీలించారు. అక్కడ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ, ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్, ఆర్ఐ రాజేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువులో విష ప్రయోగం


- రూ. లక్షల్లో నష్టం..మత్స్యకారుల ఆందోళన



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని అందుగులగూడ చెరువులో మంగళవారం విష ప్రయోగం జరిగింది. అందుగులగూడ గ్రామానికి చెందిన మత్స్యకారులు సమీప చెరువులో చేపలు పెంచుతున్నారు. బుధవారం రోజులాగే మత్స్యకారులు చేపలను పట్టేందుకు చెరువు వద్దకు వచ్చారు. అదే సమయంలో చేపలు నీటిపై తెలియడుతూ కనిపించాయి. ఇది గమనించిన మత్స్యకారులు వాటిని బయటకు తీసి పరిశీలించారు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి చెరువులో విష ప్రయోగం చేసినట్లు మత్స్యకారులు భావిస్తున్నారు. సుమారు రూ.50 వేలతో చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువులో వేసినట్లు తెలిపారు. చేపలు మరణించడంతో మత్స్యకారులకు సుమారు రూ.లక్ష నష్టం వాటిలినట్లు చెబుతున్నారు. విష ప్రయోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. విష ప్రయోగమా..? ఎండ వేడిమిని తట్టుకోలేక చేప పిల్లలు చనిపోతున్నాయా అనే అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి. సంఘటన స్థలాన్ని మాజీ సర్పంచ్ కుమురం హనుమంతు సందర్శించి పరిశీలించారు.

## నిరుపయోగంగా గ్రామపంచాయతీ ట్రాక్టర్



నవతెలంగాణ-నేరడిగొండ

గ్రామపంచాయతీలను పారిశుధ్యంగా ఉంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీకి ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. దాని నిర్వహణను గ్రామపంచాయతీలకు అప్పగించింది. నిత్యం గ్రామంలో చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడం, మొక్కలకు నీరు పోయడం వంటి గ్రామపంచాయతీ అవసరాలకు వినియోగించాల్సి ఉంటుంది. కాని మండలంలోని పీసర గ్రామపంచాయతీలోని ట్రాక్టర్‌ను ఎలాంటి పనులకు వినియోగించకుండా మూలన పెట్టేశారు. గత ఐదు సంవత్సరాల నుంచి ట్రాక్టర్‌ను వినియోగించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి పవన్‌ను వివరణ కోరగా తాను వచ్చి 8నెలలు అవుతుందని అంతకు ముందు నుంచి ట్రాక్టర్ మూలన పడి ఉందని అన్నారు. దానికి మరమ్మతులు చేయించాలంటే సుమారు రూ.లక్ష వరకు అవుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలో అంత ఆదాయం లేకపోవడంతో దానిని మరమ్మతులు చేయించలేక పోతున్నామని అన్నారు. ఈ విషయాన్ని ఉన్నాధికారులకు విన్నవించామని తెలిపారు. నిధులు వస్తే ట్రాక్టర్‌ను బాగు చేయించి వినియోగంలోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

## భైంసాలో ఏసీబీ దాడులు

- రూ.30 వేల లంచం తీసుకుంటూ పట్టుపడ్డ మున్సిపల్ కమిషనర్



నవతెలంగాణ-భైంసా

ఏసీబీ అధికారులు బుధవారం భైంసా మున్సిపల్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బిల్ కలెక్టర్ విద్యాసాగర్ పట్టుబడ్డాడు. పురాణ బజార్‌కు చెందిన రాధేశ్యాం ఇల్లుకు అనుమతులు ఇచ్చేందుకు రూ. 30 వేలు ఇవ్వాలని కోరారు. దీంతో రాధేశ్యాం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి తెలిపారు. లంచానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో ఏసీబీ దాడులు చేయడంతో అవినీతి అధికారుల్లో గుబులు రేపింది. మున్సిపల్ కమిషనర్ అక్రమాలకు పాల్పడటంతో గత కొన్ని రోజుల నుంచి మామూళ్ల మత్తులో అధికారులు ఉన్నట్లు తెలుస్తుంది. నిబంధనల పేరుతో డబ్బులు వసూలు చేస్తూ, ప్రజలకు ముప్పు తిప్పలు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ అధికారులు రైడ్ చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అవినీతి అధికారులకు ఇలాంటి బుద్ధి చెప్పాలని కోరుతున్నారు.

## ప్రతి మహిళకు ప్రభుత్వ ఫలాలు అందాలి

నవతెలంగాణ-నార్నూర్

ప్రతి మహిళకు ప్రభుత్వ ఫలాలు అందాలని, ఐకేపీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని డీఆర్డీఓ సాయన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీఓఏలు, సీసీలతో మహిళ సంఘాల రుణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళ సంఘాల సభ్యులు ప్రతి ఒక్కరూ రుణాలను సద్వినియోగం చేసుకుని, తిరిగి చెల్లించే విధంగా చూడాలని సూచించారు. మొదటి సారి వచ్చిన ఆయనను ఐకేపీ సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ ఏపీడీ నీలేష్, ఎంపీడీఓ జవహర్‌లాల్, డీపీఎంలు హేమలత, శోభారాణి, నరేందర్, సుగంధ, ఏపీఎంలు మైస రమేష్, మాధవి, డీఎంజీ రాజేందర్, సీసీలు కార్యాలయ సిబ్బంది సంతోష్, కిషన్, సత్యశీల, శ్రీరామ్, రేవయ్య, తుకారాం, నాందేవ్, అంబారావ్ వివిధ గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

# అమ్మ బడి..అయ్యేనా మరి..!

- సర్కారు బడుల ఆధునీకరణకు శ్రీకారం
- వివిధ రకాల సౌకర్యాలు కల్పించాలని నిర్ణయం
- ఆదిలాబాద్ జిల్లాలో రూ.30.52కోట్లతో అంచనాలు
- జూన్ 10లోపు పనులను పూర్తిచేయాలని ఆదేశం

**సర్కారు బడుల ఆధునీకరణకు ప్రభుత్వం పనులు ప్రారంభించింది. గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన బడులతో పాటు కొత్తగా అన్నింటిలోనూ సౌకర్యాలు కల్పించాలని సంకల్పించింది. తాజాగా 'అమ్మ ఆదర్శ బడి' పేరిట అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 140 పాఠశాలల్లో సివిల్ పనులు పూర్తిచేసిన అధికార యంత్రాంగం.. మిగితా అన్నింటిలోనూ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి నిధులు సైతం విడుదల కావడంతో పనులను వేగిరం చేయడంపైనే దృష్టిసారిస్తోంది. వీటికి సంబంధించి ఇప్పటికే పలు సమీక్షలు నిర్వహించిన ఉన్నతాధికారులు ఒకటి, రెండు రోజుల్లో విద్యా, సంబంధితశాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పూర్తిస్థాయి కార్యాచరణ రూపొందించనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. కాగా ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్ 10తేదీలోపు పనులను పూర్తిచేసి బడులు తెరిచేలోగా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.**

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాల అంటేనే సౌకర్యాలు ఉండవనే అభిప్రాయం ఉంటుంది. ఈ పద్ధతి మార్చేందుకు ప్రభుత్వాలు వివిధ రకాల పేర్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయిస్తున్నా.. మంజూరుచేసిన నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం.. జరుగుతున్న పనులకు సరైన పర్యవేక్షణ లేమి.. తీవ్ర జాప్యం కారణంగా సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు అందని ద్రాక్షగానే మారుతున్నాయి. గత ప్రభుత్వం మన ఊరు- మనబడి పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో తొలి విడత 25శాతం పాఠశాలలను ఎంపిక చేశారు. ఇలా 25శాతం చొప్పున నాలుగేండ్లలో అన్ని బడుల్లోనూ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని భావించింది. తొలి విడత ఎంపికైన బడుల్లో పనులు ప్రారంభించిన గుత్తేదారులు..ఎస్ఎంసీ కమిటీలు బిల్లులు సకాలంలో రావడం లేదనే కారణంగా అర్థాంతరంగా నిలిపివేశారు. ఫలితంగా కొన్ని మినహాయించి అనేక బడుల్లో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. తాజాగా ప్రభుత్వం మారడం.. రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువు దీరడంతో సర్కారు బడులపై దృష్టిసారించింది. గత పేరును మార్చివేసి కొత్తగా అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట బడులను ఆధునీకరించి..వివిధ రకాల సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసింది. ప్రస్తుతం ఆయా జిల్లాల వారీగా ఈ పనుల కోసం రూ.10కోట్ల వరకు నిధులు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

**జూన్ 10లోపు పూర్తికి ప్రణాళిక..!**

ప్రభుత్వం ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో కూడిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటుచేసింది. ఈ సంఘాల్లో ఒకరిని కమిటీకి ఛైర్మెన్‌గా.. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. వీరి పేరిట జాయింట్ అకౌంట్ తెరిచి నిధులు జమ చేయనున్నారు. తాజాగా చేపట్టనున్న పనులను ఈ కమిటీల ద్వారానే నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు సుమారు 650 ఉండగా ప్రాథమికోన్నత పాఠశాలలు 580, ఉన్నత పాఠశాలలు 780వరకు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 678 పాఠశాలలు ఉండగా ఇప్పటికే 140పాఠశాలల్లో సివిల్ పనులు పూర్తిచేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లోనూ 25శాతం నిధులు అందజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆయా పనులను పూర్తికి రూ.30.52కోట్లు అవసరమని అంచనా వేయగా.. ప్రస్తుతం రూ.10కోట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిసింది. పనులు ప్రారంభించగానే విడతల వారీగా నిధులు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం తాగునీరు, మేజర్, మైనర్ రిపేర్లు, టాయిలెట్స్‌తో పాటు ఈజీఎస్ నిధులతో విద్యార్థినులకు ప్రత్యేక టాయిలెట్స్ ఇలా వివిధ రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. కానీ గతంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు సకాలంలో రాక తీవ్ర జాప్యం.. పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం మూలంగా పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. తాజాగా ప్రభుత్వం ఇలాంటి సమస్యను గుర్తించి ఎప్పటికప్పుడు బిల్లులు సకాలంలో అందజేయడం..ఆయాశాఖల అధికారులతో పాటు ఉన్నతాధికారులు సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడితేనే ప్రభుత్వం విధించిన గడువు జూన్ 10తేదీలోపు పనులు పూర్తి అవుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.





### గడువులోపు పనులు పూర్తి చేస్తాం



**నారాయణ, సెక్టోరల్ అధికారి, ఆదిలాబాద్**

జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని సర్కారు బడుల్లో వివిధ రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఇప్పటికే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఆయాశాఖల అధికారుల సమన్వయంతో నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేసి విద్యార్థులకు మౌళిక వసతులు అందుబాటులోకి తీసుకొస్తాం.

## పర్సా స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకు పోరాడుదాం

- సీఐటీయూ ఆధ్వర్యంలో వర్ధంతి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మిక ఉద్యమ నాయకుడు సీఐటీయూ వ్యవస్థాపకులు పర్స సత్యనారాయణ స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకు పోరాడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో సత్యనారాయణ 9వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ పర్స సత్యనారాయణ గుంటూరు జిల్లా సత్తనపల్లి గ్రామంలో జన్మించారని, నాడు నిజాం దోపిడీకి పీడనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో ప్రధాన భూమిక పోషించారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, జైలు జీవితం 2 సంవత్సరాల అజ్ఞాత జీవితం గడిపారన్నారు. పర్స సత్యనారాయణ సింగరేణి ఉద్యోగం చేశారని, ఆ కాలంలో కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తూ కార్మికుల్లో మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. ఆ సంబంధంగా ట్రేడ్ యూనియన్ ను నిర్మించినట్టు తెలిపారు. కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించేవారు చదవడం గురించి పోరాట పద్ధతుల గురించి స్పష్టంగా చెప్పేవారన్నారు. శాసనసభ సభ్యుడిగా ఉన్న నాడు కూడా దర్పం ప్రదర్శించేవారు కాదని ఆయన జీవితంలో నమ్రత, అధ్యాయనం, పోరాట పటిమ ఆయన జీవితంలో కనిపించే అంశాలు అన్నారు. నిరంతరం పరిస్థితులకు తగ్గట్టుగా వ్యవహరించేవారన్నారు. ఉన్నత చదువులు చదివిన వారికి, అత్యంత వెనుకబడిన ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కూడా సులభంగా అర్థమయ్యేటట్టు పాఠాలు బోధించేవారు. కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఎదురైనా ఒడిదుడుకులు వచ్చిన నమ్మిన దారిలో చివరివరకు ప్రయాణించారన్నారు. అందుకే ఆయన ధన్యజీవి అని కార్మిక వర్గం అంతా ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని హక్కుల సాధనకు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, సీఐటీయూ జిల్లా కోశాధికారి కే.సునిత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దర్శనాల నగేష్, ఐద్వా జిల్లా కోశాధికారి ఆర్.మంజుల, సీఐటీయూ జిల్లా నాయకులు రమాకాంత్, అరుణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కోశాధికారి స్వామి, ఆశన్న, గిరిజన సంఘం జిల్లా కోశాధికారి ఆత్రం కిష్టన్న పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశానికి ఉపాధ్యాయుల ప్రచారం



నవతెలంగాణ-నిర్మల్

మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రవేశానికి బుధవారం ఉపాధ్యాయులు పెద్ద చెరువు కట్ట వద్ద గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు గజపల్లి నర్సయ్య మాట్లాడారు. పాఠశాలలో ఆరో తరగతిలో ఇంగ్లీష్ మీడియం ప్రారంభించడం జరుగుతుందని తెలియజేశారు. ఉన్నత విద్యార్హతలు, అత్యంత అనుభవం కలిగి అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారని వెల్లడించారు. స్మార్ట్‌క్లాస్‌ల నిర్వాహణతో పాటు వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అంతే కాకుండ ప్రభుత్వం తరఫున విద్యార్థులకు రెండు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, కాపీలతో పాటు మధ్యాహ్న భోజనంలో పుష్టికరమైన ఆహారం అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతే వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత మాదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలోని బస్టాండ్ వద్ద గల గాంధీ విగ్రహాన్ని గత వారం రోజుల కింద గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేసి, దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకొని, శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొత్తవార్ రాజేశ్వర్, హరీష్, దివాకర్, రాజు ఉన్నారు.

## నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు ప్రయత్నాలు చేయడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలను అరికట్టడంలో భాగంగా వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ బృందాలు రైతులను మోసం చేసే, నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిని గుర్తించి సమాచారం సేకరించి వారిపై కఠినంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో మండల, డివిజన్ స్థాయితో పాటు జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్టాక్ రిజిష్టర్, బిల్‌బుక్, నిర్వహణ వంటి చిన్న చిన్న లోపాల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ టాస్క్ ఫోర్స్ కమిటీలో జిల్లా పరిధిలో డీఎస్పీ, ఏడీఏ, ఆర్డీఓలు ఉంటారని, మండల, డివిజన్ స్థాయిలో తహసీల్దార్, ఏఓ, సీఐ ఉంటారని తెలిపారు.

**లైసెన్స్ లేనివారిపై కేసులు నమోదు చేస్తాం..**

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పాల్గొని మాట్లాడుతూ జిల్లా పరిధిలో విత్తన, ఎరువుల దుకాణాలను, గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీలు, అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ వెంటనే పరీక్షలకు పంపించడం, రవాణా వాహనాలను కూడా ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుందని తెలిపారు. లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేసే వారిపై, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా అవగాహన కల్పించాలని అన్నారు. నకిలీ విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమ రవాణా జరిగే ప్రాంతాలు, మార్గాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు చేయడంతో పాటు నకిలీ, కల్తీ విత్తనాల అక్రమ రవాణాను, సరఫరా నిరోధించేందుకు నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయడం జరిగిందిని నకిలీ విత్తన అక్రమార్కులపై పీడియాక్ట్ అమలు చేయడానికి వెనుకడుగు వేయమని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, డీఎస్పీ జీవన్ రెడ్డి, తహసీల్దార్లు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదిమ గిరిజన కొలాం, తోటి, కొలావర్ విద్యార్థిని, విద్యార్థులు 2022-23, 2023-24 విద్య సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులలో తెలంగాణ గిరిజన సంక్షేమ ప్రతిభ కళాశాలలు హయత్ నగర్, హైదరాబాద్‌లో అడ్మిషన్ల కోరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలకు ఐటీడీఏ పీఓ, రిజినల్ కోఆర్డినేటర్ గురుకులం ఐటీడీఏ ఉట్నూర్‌లో సంప్రదించాలని అన్నారు. అభ్యర్థులు తమ అన్ని సర్టిఫికెట్స్‌తో పాటు ఆధార్ కార్డు, నాలుగు పాస్ ఫోటోలు తీసుకొని వచ్చి ఐటీడీఏలోని ఆర్‌సీఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | మే 23, 2024 | www.navatelangana.com

## ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. వేసవికాలంలో ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆర్టీసీ ద్వారా కల్పిస్తున్న సేవలతో పాటు గమ్యం యాప్ ద్వారా లభించే సౌకర్యాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది యూసుఫ్, సతీష్, భాగ్యవతి పాల్గొన్నారు.

## అందుబాటులో సోయా, కంది విత్తనాలు

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని వ్యవసాయ పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రంలో సోయా విత్తనాలు, కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ కార్తీక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విత్తనాలను ఈనెల 24 తేదీ నుంచి విక్రయించనున్నట్టు పేర్కొన్నారు. కంది విత్తనాల రకం డబ్ల్యూఆర్జి 97, హనుమ టీడీఆర్జీ-4 విత్తనాలు (4కిలోలు) బస్తా ధర రూ.600, ఆరు కేజీల బస్తా ధర రూ.900 లకు విక్రయించడం జరుగుతుందని అన్నారు. సోయా బీన్, బాసర అనే రకం 25కేజీల బస్తా ధర రూ.2750 లకు లభిస్తుందని అన్నారు. రైతులు నేరుగా ముధోల్ వ్యవసాయ పరిశోధనా స్థానంకు వచ్చి కొనుగోలు చేసుకోవచ్చన్నారు. దూర ప్రాంత రైతులు తమ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తే రైతులకు దగ్గరలో ఉన్న ట్రాన్స్‌పోర్ట్‌కు పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగతా వివరాలకు శాస్త్రవేత్త డా.విజయ్ కుమార్ సెల్ నెంబర్ 7337399462ను సంప్రదించాలన్నారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- నీటిపారుదల శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్

నవతెలంగాణ-నిర్మల్

ప్రతి రైతు నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని నీటిపారుదల శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. బుధవారం సోన్ మండలం న్యూవెల్మల్, బొప్పారం, నిర్మల్ రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ధాన్యం తరుగు ఏమైనా తీస్తున్నారా అని రైతులను ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని సమాధానం ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారులకు తెలియచేయాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని, సేకరించిన ధాన్యాన్ని వెనువెంటనే లారీలలో లోడ్ చేయించి రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్‌లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ





బ్యాగులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలను వలన రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని భరోసా కల్పించారు. ప్రతి రైతు నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, ఆందోళన చెందవద్దని అన్నారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని అన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 228 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1 లక్ష 2,698 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఎక్కడ కూడా తరుగు వంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కేంద్రాలలో రైతులకు అవసరమైన తాగునీరు, టెంట్, క్లినింగ్ మిషన్, టార్పాలిన్లు, గన్ని బ్యాగ్స్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచామని అన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని జిల్లా అధికారుల వరకు ప్రతి ఒక్కరూ కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించడం, రోజువారీ పురోగతిని సమావేశంలో చర్చించడం జరుగుతుందని కలెక్టర్ ప్రత్యక అధికారికి వివరించారు. కార్యక్రమాలలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారిని నందిత, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎం శ్రీకళ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఏడి మార్కెటింగ్ అశ్వాక్, డీసీఓ నర్సయ్య, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీఓ గజానంద్, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులను బుధవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పాల్గొని ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, రాజకీయ పరిస్థితులు, ఎన్నికల విధానాల గురించి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు లంక రాఘవులు కార్యకర్తలకు వివరించారు. ముందుగా కార్మిక ఉద్యమ నాయకుడు సీఐటీయూ వ్యవస్థాపకులు పర్స సత్యనారాయణ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పార్టీ కార్యవర్గ సభ్యుడు లంక రాఘవులు శిక్షణ తరగతులు ప్రారంభించి మాట్లాడారు. దేశంలో పదేండ్ల పాటు బీజేపీ పాలన సాగించి, ఏ వర్గానికి కూడా న్యాయం చేయలేదని అన్నారు. ధరలను నియంత్రిస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని ప్రకటించి మోసం చేశారన్నారు. ప్రస్తుత రాజకీయాలు, ఎన్నికలు, సీపీఐ(ఎం) పాత్ర లాంటి అంశాలపై కార్యకర్తలకు శిక్షణాలు అందించామని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో నాయకులు భీంరావ్, బండి దత్తత్రి, లంక జమున, మంజుల నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్ దరఖాస్తులు వారంలోగా పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న ధరణి, ప్రజావాణి దరఖాస్తులను వారంలోగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవిన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వారంలోగా పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే ఫీల్డ్ ఇన్స్‌పెక్షన్ చేసి ఆన్‌లైన్‌లోనే కాకుండా ఫైల్స్ రూపంలో కూడా నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిపోర్టులను పరిశీలించి, సంబంధిత నివేదికలతో పూర్తిస్థాయిలో కలెక్టరేట్‌కు సమర్పించాలని అన్నారు. ప్రత్యేక చర్యలు చేపట్టి పూర్తిచేయాలని అన్నారు. ఈ క్రమంలో మండలాల వారీగా తహసీల్దార్‌లను వారి లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించిన త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జూన్ రెండో వారంలో ప్రజావాణి ప్రారంభమవుతుందని అన్నారు. ఆ లోపు ఇప్పటి వరకు ఉన్న అన్ని రకాల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్, జీవాకర్ రెడ్డి, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని బీజేపీ సీనియర్ నాయకులు సామల వీరయ్య తల్లి భారత(70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ సీనియర్ నాయకులు సత్య నారాయణగౌడ్, వడ్డే రాజేందర్‌రెడ్డి, భూపతిరెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ విలాస్, కాంగ్రెస్ నాయలు రాజేశ్వర్‌రావ్, పరామర్శించి మృతికిగల కారణాలను తెలుసుకొని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-పెంబి



వర్షాకాలం సాగుకు సంబంధించి రైతులకు కావాల్సిన వివిధ పంటల విత్తనాల నిల్వలు అందరికీ సరిపడే మోతాదులో అందుబాటులో ఉన్నాయని ఖానాపూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు సుజాత తెలిపారు. బుధవారం పెంబి మండలంలోని అంకెన, రాయదారి, చింతగూడ, పోచంపల్లి గ్రామాల్లోని విత్తన డీలర్ల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సుజాత మాట్లాడుతూ పత్తి, మొక్కజొన్న పంటలకు సంబంధించిన విత్తన ప్యాకెట్లను బ్లాక్ మార్కెటింగ్ చేసే విత్తన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. పత్తి విత్తనాలను తూచా తప్పకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు లోబడి మాత్రమే విక్రయించాలని, విత్తన వ్యాపారులకు ఈ సందర్భంగా సూచించారు. అలాగే రైతులు కూడా ఒకే బ్రాండ్‌కి చెందిన విత్తనాలు మాత్రమే కావాలని పట్టు పట్టడం కూడా రైతులకు శ్రేయస్కరం కాదని దీనివల్ల మార్కెట్లో ఆ బ్రాండ్‌కు సంబంధించి కృత్రిమ కొరత ఏర్పడుతుందని తెలిపారు. వ్యవసాయ శాఖ లైసెన్సు పొందిన డీలర్ల వద్ద లభించే అన్ని రకాల విత్తనాలు నాణ్యమైనవే ఉంటాయని సూచించారు. విత్తనాలు కొన్న రసీదును పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్, విత్తన వ్యాపారులు ప్రేమ్‌దాస్, భీంరావు, నరేష్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## తెర్వి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని తన్యనాయక్ తండ గ్రామానికి చెందిన సకారాం నాయక్ ఇటీవల మృతి చెందారు. బుధవారం ఆయన తెర్వి కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సకారాం నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల కేంద్ర వీడీసీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బురదలో కురుకుపోయిన ఆర్టీసీ బస్సు



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని బుధవారం భారీ వర్షం పడింది. కురిసిన గాలి వానతో పులిమడుగు గ్రామ సమీపంలో రోడ్డు పక్కన బురదలో ఆర్టీసీ బస్సు కురుకుపోయింది. దీనితో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై గాలితో చెట్లు పడ్డాయి. పడిపోయిన చెట్లను గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారు.

## పక్షి ప్రేమికుడికి రాష్ట్రస్థాయి అవార్డు



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన జక్కుల వెంకటేష్‌కు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. బుధవారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా హన్మకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో బోథ్ పట్టణానికి చెందిన పక్షి ప్రేమికుడు సాముహిక సేవకుడు జక్కుల వెంకటేష్‌కి ప్రశంస పత్రం పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతి పాఠశాలలోని విద్యార్థులకు పర్యావరణం, ప్రకృతి గురించి అవగాహన కల్పిస్తూ పక్షులకు బర్డ్ ఫీడర్‌లు అందిస్తు, తన సొంత ఖర్చులతో వివిధ గ్రామాల్లో అవగాహన కల్పించినందుకు తన సేవలు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు చేసినందుకు గుర్తిస్తూ అవార్డు రావడం జరిగిందన్నారు. వెంకటేష్‌కు ఈ అవార్డు దక్కడంతో కుటుంబీకులు, గ్రామస్తులు అభినందించారు.

## భాగ్యరెడ్డి 136వ జయంతి వేడుకలు



నవతెలంగాణ-నిర్మల్

దళితుల అభివృద్ధికి విశేష కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి వేడుకలను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎస్సీడీఓ రాజేశ్వర్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుమారి గ్రామంలో ఈజీఎస్ ఉపాధిహామీ సీసీటీ పనులను బుధవారం ఎంపీడీఓ రాజ్‌వీర్ పరిశీలించారు ఈ సందర్భంగా పనులు బాగా చేయాలని ఒక మీటర్ వెడల్పు ఒక మీటర్ పొడవు ఒక మీటర్ లోతు ఒక మనిషికి ఇలా పని చేసినట్లయితే రూ.3వందల వేతనం వస్తుందని అన్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శి ఈజీఎస్ ఉపాధిహామీ పని ప్రదేశంలో నీళ్లు, టెంట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉంచాలని అన్నారు. అటవీ ప్రదేశంలో ఇలా గుంతలు తవ్వినట్లయితే గుంతలలో నీళ్లు నిలువ ఉండి చెట్లకు తేమ ఎక్కువ రోజులు ఉంటుందని అందువల్ల చెట్లు పచ్చగా ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంత్, ఎఫ్ఏ ఉన్నారు.



## గ్రామాభివృద్ధి కమిటీ ఏర్పాటు.

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని ఆలూరు గ్రామంలో బుధవారం గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. వీడీసీ అధ్యక్షులుగా పతని నర్సయ్య, ఉపాధ్యక్షులుగా గుండ్ల రవి, కార్యవర్గ సభ్యులు ఈర్ల చిన్నయ్య, పతని భూమయ్య, చందల సాయినాథ్, లక్ష్మీ నారాయణ, మనుపూరి లక్ష్మన్, ఆకుల రమేష్, రమణతో పాటు 20 మంది సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా గ్రామాధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## సైబర్ నేరాల పట్ల అవగాహన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

సైబర్ నేరాల పట్ల ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఎలాంటి వివరాలు అడిగిన స్పందించొద్దని తెలిపారు. రాబోవు స్థానిక ఎన్నికల పట్ల, ఓటు హక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కలిపించారు. గ్రామాల్లో ఎవరైనా వ్యక్తులు ప్రజాశాంతికి భంగం కలిగేలా వ్యవహారిస్తే కఠిన చర్యలు తీసుకొని, బైండోవర్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, సీసీ కెమెరాల ప్రాధాన్యత గురించి గ్రామస్తులకు వివరించారు.



## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ రిమ్స్ సబ్ స్టేషన్‌లోని కలెక్టర్ చౌక్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయంలో ఉంటుందని ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దీని వల్ల స్థానిక ఫిల్టర్ బెడ్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, ఎన్టీఆర్ చౌక్, కలెక్టర్ చౌక్ ఏరియాలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయనికి సహకరించాలని కోరారు.

## రద్దయిన ఐఎన్టీయూసీ జిల్లా కమిటీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐఎన్టీయూసీ రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు, యూత్ అధ్యక్షుడు మినహా మిగితా పదవులను అన్నీ రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలని కోరారు. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా త్వరలోనే నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు.

## ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డాక్టర్ కళ్యాణ్‌రెడ్డి

- ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యుల వెల్లడి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ ఆస్పత్రిలోని వైద్యులు వరుసగా అనారోగ్యం పాలవ్వడం ఆందోళన కలిగిస్తున్నాయి. ఆర్థోపెడిక్ వైద్యుడు తిప్పేసామికి ఇటీవలే మైల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ రాగా, తాజాగా ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్‌రెడ్డికి మైల్డ్ హార్ట్ స్ట్రోక్ రావడం వైద్యవర్గాల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. బుధవారం విధుల్లో ఉండగా డాక్టర్ కళ్యాణ్‌రెడ్డికి ఛాతిలో నొప్పి రావడంతో వెంటనే డాక్టర్‌ను ఓ ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం చికిత్స చేయగా ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

## వరిగడ్డి వాము దగ్ధం

నవతెలంగాణ-దహేగాం



మండల కేంద్రంలో బుధవారం ప్రమాద వశాత్తు నిప్పంటుకుని రఘోత్తమ్ అనే రైతు తన ఇంటి సమీపంలో నిల్వ ఉంచిన వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం తన నాలుగు ఎకరాల పొలంలో గడ్డిని పశువుల మేతకు ఉంచగా ప్రమాదం జరిగి కాలిపోయిందన్నారు. మంటలు ఆర్పేందుకు ఫైరింజన్‌కు ఫోన్ చేయగా స్పందించలేదన్నాడు. స్థానికంగా విద్యుత్ కోత ఉండటంతో కల్వాడా గ్రామానికి వెళ్లి ట్యాంకర్‌లో నీళ్లు తెచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండాపోయిందనిని వాపోయాడు. ఆర్థికంగా నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## భూ పరిహారం అక్రమాల్లో ఏడుగురిపై కేసు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గతంలో పూర్తి చేసిన నేషనల్ హైవే పనుల్లో భాగంగా భూ పరిహారం అక్రమాలకు పాల్పడిన ఏడుగురిపై ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. నేషనల్ హైవే పనుల్లో భాగంగా జిల్లా కేంద్రానికి చెందిన తారాబాయికి సంబంధించిన భూమి రోడ్డు వెడల్పులో పోకున్నప్పటికీ రూ.మూడు కోట్లు పరిహారం పొందినట్లు గతంలో కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు చేసిన దాడుల్లో ఆధారాలు దొరికాయని దీన్ని ఆధారంగా ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. గతంలో ఆర్డీఓగా పని చేసిన దత్తు, డిప్యూటీ తహసీల్దార్ నాగోరావు, సర్వేయర్ భరత్ స్థిరాస్తి వ్యాపారస్తుడు శంభుదాస్, లక్ష్మీనారాయణ గౌడ్, తిరుపతితో పాటు పరిహారం పొందిన తారాబాయిపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏది ఏమైనా ఏసీబీ అధికారుల దాడుల్లో దొరికిన ఆధారాలతో మరికొంతమంది కూసాలు కదిలే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పరిహారంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని గతంలో ఆరోపణలు వచ్చినప్పటికీ ఉన్నత అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంతో మరుగున పడిపోయింది. తాజాగా ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారుల దాడుల్లో అసలు నిజాలు బయటికి వస్తున్నాయి.

## రైతులకు రసీదులు ఇవ్వాలి



నవతెలంగాణ-వాంకిడి

విత్తనాలు, ఎరువులు విక్రయించే డీలర్లు రైతులకు విధిగా రసీదులను అందించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మండలంలోని విత్తనాల డీలర్లకు సమీక్ష సమావేశాన్ని బుధవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో నిర్వహించారు. విత్తనాల డీలర్లు విత్తనాలను అమ్మేటప్పుడు విధిగా రైతులకి బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయించవద్దని సూచించారు. రైతులు కూడా కొన్న విత్తనాలకు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీలర్లు రోజు స్టాక్ వివరాలను మండల వ్యవసాయ అధికారికి రాత పూర్వకంగా పంపించాలని, ఎంఆర్‌పీ ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓలు శంకర్, మానస, పరిమళ, వెంకటేష్, డీలర్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, శివ కుమార్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని అగరగూడ, కమ్మర్గాం, నందిగాం, మురళిగూడ గ్రామాల్లో ఎంపీడీఓ అల్బర్ట్ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీలు, స్మశాన వాటికలు, పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ పని ప్రదేశం వద్ద తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరికీ వందరోజుల పని కల్పించే విధంగా చూడాలని అన్నారు. అలాగే గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి హరితహారం వరకు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులను, స్మశాన వాటికలను పరిశీలించి సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎంపీఓ గంగాసింగ్, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య, బాపూరావు పాల్గొన్నారు.


## లక్ష మెజారిటీతో గెలుపు ఖాయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లక్ష మెజార్టీతో తన గెలుపు ఖాయమని బీజేపీ ఎంపీ అభ్యర్థి గేడం నగేష్ ఆశాభవం వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత మొట్టమొదటిసారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన జడ్పీటీసీ నాగేశ్వరరావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ప్రజలు సుస్థిర ప్రభుత్వాన్ని కోరుకున్నారని, పల్లె పట్టణంతో పాటు సామాజిక వర్గాలు తేడా లేకుండా అందరూ బీజేపీకి ఓటేశారన్నారు. కాంగ్రెస్ ఎన్ని రకాల ప్రలోభాలు పెట్టిన ప్రజలు చైతన్యవంతులై వాటికి లొంగలేదన్నారు. తెలంగాణలో 10 స్థానాలు రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. దేశంలో గత పది సంవత్సరాలలో ప్రవేశపెట్టిన ఉజ్వల, ముద్ర యోజన లాంటి పథకాలతో పాటు అభివృద్ధి పనుల్లో భాగంగా నేషనల్ హైవేల నిర్మాణం కూడా దేశ ప్రగతిని ఎంతో పెంచిందన్నారు. దేశం అభివృద్ధిలో 11వ స్థానం నుండి 5వ స్థానానికి వచ్చిందని దీనిని మూడో స్థానానికి తీసుకువెళ్లడం లక్ష్యమన్నారు. దేశంలో అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపించామన్నారు. ఇప్పటివరకు జరిగిన ఐదు విడుతల్లో 300 సీట్లు సాధించడం ఖాయమని తెలిపారు. అంతకుముందు జడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీని మరోసారి దేశ ప్రధాని చేయడమే ప్రజల లక్ష్యంగా ఎన్నికలు సాగాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, జిల్లా నాయకులు కొట్నాక విజయ్, ఖాండ్రే విశాల్, నాయకులు పెంటయ్య, విలాస్ పాల్గొన్నారు.

## విలేకరిపై దాడి చేసిన వారిని శిక్షించాలని వినతి



నవతెలంగాణ-బెజ్జూర్

కాగజ్‌నగర్‌కు చెందిన విలేకరి అంగల తిరుపతిపై దాడి చేసిన దుండగులను శిక్షించాలని ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు కోరారు. బుధవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అచ్యుతరావు, ఎస్సై విక్రమ్‌కు వినతిపత్రాలు అందజేశారు. పాత్రికేయుడుపై దాడి చేసిన మైనింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పాత్రికేయులు శ్రీరామ మోహన్ చారి, శ్రీకాంత్ చారి, మహేందర్, మహేష్, నాగేష్, శ్రీనివాస్, దేవాజి, శ్రీనివాస్, తిరుపతి, దామోదర్, శ్రీనివాస్, లింగయ్య, నరేందర్, రవికుమార్ పాల్గొన్నారు.

# హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- వరి కొనుగోళు, కుట్టు మిషన్ కేంద్రాల పరిశీలన



వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-సిర్పూర్(టి)

హరితహారానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని అచ్చపల్లి గ్రామంలో పల్లెప్రకృతి వనాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్‌తో కలిసి సందర్శించారు. వేసవి దృష్ట్యా నర్సరీలోని ప్రతి మొక్కను రక్షించేల చూడాలని సిబ్బందికి సూచించారు. సమయానికి మొక్కలకు నీరందించాలని, ఎండవేడి ఎక్కువగా తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విత్తనాలు నానబెట్టడం, నాటడం వంటి పనులు ప్రణాళిక ప్రకారం చేయాలని తెలిపారు. వానాకాలంలో మొక్కలు నాటేందుకు, అవసరమయ్యే మొక్కలు అందించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొక్కల సంరక్షణకు తీసుకునే జాగ్రత్తలపై నర్సరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మహిళల కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలకు ఏకరూప దుస్తుల కుట్టు పనులను పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా విద్యార్థులకు నాణ్యతతో కూడిన దుస్తులను అందించాలని, కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని అన్నారు. ప్రతి ఒక్క యూనిఫాంకు ప్రభుత్వం నుండి రూ.50 అందించనున్నట్లు తెలిపారు. అనంతరం లోనవెల్లి, దుబ్బగూడలో గల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలపై ఆరాతీశారు. మిల్లర్లు, రైతులతో మాట్లాడారు. రైతుల వారీగా కొనుగోళ్ల సాగు విస్తీర్ణం, ధాన్యం వివరాలను నిర్వాహకులు ప్రతిరోజు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటవెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చూడాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వర్షాలు కురిసే అవకాశమున్నందున టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం తేమశాతంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే కొనుగోలు కేంద్రం దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలుంటాయన్నారు. ఈయన వెంట సిర్పూర్, కాగజ్‌నగర్ తహసీల్దార్లు శ్రీనివాస్, కిరణ్, సంబంధిత అధికారులున్నారు.

# భానుడి భగభగ... ప్రజలు విలవిల

- దంచికోడుతున్న ఎండలు
- బయటకు రావడానికి జంకుతున్న జనాలు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు



జనాలు లేక నిర్మానుష్యంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రెండు రోజులుగా భానుడు విశ్వరూపం చూపడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ప్రజలు పశుపక్ష్యాదులు కూడా బయటకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. మే చివరకు వచ్చిన ఎండలు తగ్గక పోవడంతో పగలు రోడ్లపైకి రావడానికి జనాలు జంకుతున్నారు. అత్యవసరమైతేనే తప్ప రోడ్ల పైకి ప్రజలు రావడం లేదు. రోజురోజుకు ఎండలు పెరగడంతో ఏజెన్సీ ప్రాంత గిరిజనులు నీటికి విలవల లాడుతున్నారు. ఎండలతో పాటు వేడి గాలుకు జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 11 గంటల నుంచి వీచే వేడి గాలికి జనాలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ నుంచి ఉపశనం పొందేందుకు కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్న అవి కూడా ఈ వేడికి పని చేయడం లేదు. ఎండలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రజల కష్టాల పైన ప్రత్యేక కథనం

### గతవారం రోజులుగా పెరిగిన ఎండలు

గడిచిన వారంలో గత శనివారం 39 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రత, ఆదివారం 40, సోమవారం 40, మంగళవారం 45, బుధవారం 45 డిగ్రీలుగా నమోదైంది. ఈ విధంగా ప్రతి రోజు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో ప్రజలు బయటకు రావడానికి బయపడుతున్నారు. దీనితో జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ఇతర మండలాల ప్రజల తాకిడి తగ్గడంతో వ్యాపారులకు గిరాకీలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు రద్దీగా కన్పించే జిల్లా కేంద్రంలోని రహదారులు మంగళవారం పెరిగిన ఎండా నేపథ్యంలో నిర్మానుష్యంగా మారాయి.

### జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్లు

జిల్లాలో ఎండలు పెరుగుతున్నందున పని మీద బయటకు వెళ్ళే వారు తప్పనిసరిగా వెంట నీటిని తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. అలాగే ఎండలో పనిచేసే వారు అదే పనిగా మధ్యాహ్నం అంతా పనిచేయకుండా కొద్దిసేపు నీడలో విశ్రాంతి తీసుకోవాలి. ఎండకు వెళ్తున్నప్పుడు తప్పనిసరిగా తలకు తువాల చుట్టుకోవాలి. ఉపాదిహామి కూలీలు పొద్దున్న పూట మాత్రమే పనిచేసేలా చూసుకోవాలి.

### పగటిపూట రోడ్లు ఖాళీ

ఎండలు మండుతుండడంతో జనాలు బయటకు వెళ్ళడానికి జంకుతున్నారు. దీంతో జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలలో జనాలు రోడ్డు పైకి రాక పోవడంతో దుకాణాలు, రోడ్లు మధ్యాహ్న సమయంలో ఖాళీగా కనిపిస్తున్నాయి. ఆదివారం నాడు మాత్రమె కొంత రద్దీ తక్కువగా కన్పించే జిల్లా కేంద్రం వారం నుండి రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

# మహిళా సంఘాల అభివృద్ధికి కృషి : డీఆర్‌డీఓ



మహిళ సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ సురేందర్

నవతెలంగాణ-బెజ్జూర్

మహిళా సంఘాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని డీఆర్‌డీఓ సురేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మహిళా సంఘాలతో పాఠశాలల యూనిఫామ్‌లను కుట్టిస్తున్నామన్నారు. దీని ద్వారా మహిళలకు ఆదాయం సమకూరుతుందని, మరికొంతమంది మహిళలు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. జూన్ 5లోపు అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయన్నారు. బెజ్జూర్ మహిళా సంఘం ఆధ్వర్యంలో పశుధాన్యం కొనుగోళు కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి ఉపాధిని కల్పిస్తామన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెరిగిందని, అందరికీ కూలీ డబ్బులు అందుతున్నాయన్నారు. ఆయన వెంట అడిషనల్ డీఆర్‌డీఓ రామకృష్ణ, డీపీఎం అన్నాజీ, మోహన్ లాల్, ఎంపీఓ రమేష్ రెడ్డి, సీసీ భద్రయ్య, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి ఉన్నారు.

# కేసుల పరిష్కారం పారదర్శకంగా జరగాలి

- ఎస్పీ సురేష్ కుమార్



ప్రశంసా పత్రాలను అందిస్తున్న ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన ప్రతి కేసులో సాక్ష్యాలను సేకరించి పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో స్టేషన్ల అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్లలో నమోదైన కేసుల విచారణ నాణ్యతతో పారదర్శకంగా ఉండాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలన్నారు. కేసుల పరిష్కారం కోసం ఉన్న అన్ని రకాల సాంకేతిక నైపుణ్యాలను వాడుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో నకిలీ విత్తనాల పట్ల పోలీస్ స్టేషన్ల వారిగా తనిఖీ చేసి నకిలీ విత్తనాలు నివారించాలన్నారు. రైతులను మోసం చేసేల ఎవరు వ్యవహరించిన చట్ట పరంగా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు

పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. చెక్ పోస్ట్ విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో వాంకిడి సీఐ శ్రీనివాస్, సిర్పూర్-టి ఎస్సై డి రమేష్, కాగజ్‌నగర రూరల్ సీఐ రాంబాబు, నార్కోటిక్స్ స్పెషల్ డ్రైవ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో కాగజ్‌నగర్ టౌన్ సీఐ శంకరయ్య, కెరమెరి ఎస్సై విజయ్ పురస్కారాలు అందుకున్నారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు, ఎస్సైలు, ఆర్ఐలు, డీసీఆర్బీ, ఐటీ, విభాగాల ఎస్సైలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

## జీవ వైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలి

- డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్
- ఘనంగా అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, రెబ్బెన ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రీధరచారి అన్నారు. జీవవైవిధ్య దినోత్సవంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం నుండి నిర్వహించిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కుమురం భీం, అంబేద్కర్ చౌక్ నుండి తిరిగి జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవవైవిధ్య రక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతో పాటు అటవీ సంరక్షణలో తమతో కలిసి రావాలన్నారు. జంతువుల సంరక్షణ ఉన్నప్పుడే పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుత సంవత్సరం 48 నుండి 50 డిగ్రీల వరకు వేసవి తాపం చేరిందంటే దానికి పర్యావరణ సమతుల్యం లేకపోవడమే కారణమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు సరోజ రాణి, సెక్షన్ అధికారులు సత్యనారాయణ, లక్ష్మణ్, సతీష్, కొమ్మాల్, బీట్ అధికారులు రాజేష్, రజిత, విద్య, ఉమారాణి, స్వప్న, కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా




నవతెలంగాణ-కౌటాల

మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బసర్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన బుధవారం ఉదయం జరగాల్సి ఉండగా కోరం లేక సమావేశాన్ని ఎంపీడీఓ అబ్దుల్ నసురుల్లా ఖాన్ వాయిదా వేశారు. మండలంలో మొత్తం పది మంది ఎంపీటీసీలు ఉండగా గుండాయిపేట్ ఎంపీటీసీ చనిపోవడంతో ప్రస్తుతం 9 మంది ఎంపీటీసీలున్నారు. బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి కన్నేపల్లి ఎంపీటీసీ దుర్గం మోతీరాం తప్ప ఏ ఒక్క ఎంపీటీసీ హాజరు కాలేదు. దీంతో మధ్యాహ్నం 12 గంటల పది నిమిషాలకు సభ్యులు ఎవరు రాని కారణంగా కోరం లేకపోవడంతో సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తదుపరి ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామని ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ ఖాన్ తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు కూడా అంతంత మాత్రంగానే హాజరయ్యారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే




నవతెలంగాణ-ఆసిఫాబాద్

వరంగల్, నల్గొండ, ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ములుగులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించే సన్నాహక సమావేశంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ములుగు నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఎమ్మెల్యేలను నియమించగా ఆమె ప్రచారంలో పాల్గొన్నారు. తమ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వాంకిడి జడ్పీటీసీ అజయ్ కుమార్, రెబ్బెన మండల నాయకులు సంజీవ్ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-దహెగాం



మండలం లోని కొంచవెల గ్రామానికి చెందిన గౌరే అనిల్ అనారోగ్యంతో బాధపడుతుండగా పెంచికల్‌పెట్‌కు చెందిన సామాజిక కార్యకర్త చప్పిడ ప్రకాశ్ బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు నెలల క్రితం ప్రమాదవశాత్తు స్తంభంపై నుండి పడటంతో నడుము విరిగి బదపడుతున్నడన్న సమాచారం తెలుసుకున్న బెజ్జూర్ మాజీ జడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు సూచన మేరకు రూ.5000 ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. దాతలు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుండయ్య, గణపతి పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో నకిలీ విత్తనాలు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. కొంతమంది అక్రమార్కులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని నకిలీ విత్తనాలు తీసుకువస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిపై ఉక్కు పాదం మోపేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు సమాచారం అందితే పోలీసులకు తెలియజేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నకిలీ విత్తనాల నివారణకు ప్రత్యేక టీంలు పని చేస్తున్నాయని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | మే 23, 2024 | www.navatelangana.com

## క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

తెమడతో కూడిన దగ్గు, ఆయాసం అలసట ఆకలి లేకపోవడం వంటి టీబీ లక్షణాలు గల అనుమానితులు హెల్త్ క్యాంపుల్లో క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ శశికాంత్ తెలిపారు. బుధవారం తాండూర్ మండలం చౌటుపల్లి గ్రామంలో టీబీ నిర్ధారణ పరీక్షలు చేశారు. 19 మందికి తెమడ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. టీబీ నిర్ధారణ క్యాంపులను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ తార పంచాయతీ సెక్రెటరీ వసంత, ఏఎన్ఎం తులసి, ఆశా మల్లేశ్వరి పాల్గొన్నారు.

## వికసించిన మే పుష్పం

నవతెలంగాణ-మంచిర్యాల

చాలా అరుదుగా కనిపించే మే పుష్పం మంచిర్యాలలో జిల్లా కేంద్రంలో వికసించింది. పట్టణంలోని ప్రభుత్వ టీచర్ గుండేటి యోగేశ్వర్ ఇంట్లో వికసించిన మే పుష్పం పలువురిని ఆకట్టుకుంది. లిల్లీ మొక్కలను పోలి ఉండే మే పుష్పం ప్రతి ఏడాది మే మొదటి వారంలో నే వికసించగా ఈ ఏడాది వాత వరణంలో జరిగిన మార్పుల దృష్ట్యా కాస్త ఆలస్యంగా వికసించినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు.



# లోతైన దుక్కులతో భూసారం మెరుగు

పంట పొలాల్లో వేసవి దుక్కులు వల్ల దిగుబడులకు ఎంతో మేలు జరుగుతుంది. కలుపు యజమాన్య ప్రక్రియను వేసవి నుంచి చేపడితే కలుపు మందులను ఆశ్రయించకుండా రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించడానికి వీలుంటుంది. భూమిని లోతైన దుక్కులు దున్నడం వల్ల మిగిలిపోయిన కలుపు మొక్కలను పూర్తిగా నాశనం చేయొచ్చనీ, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

• పొలానికి అడ్డంగా దున్నడం మేలు • సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లాలో ఎక్కువగా సాగు చేసే పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తుంటారు. ఈ పంటలు పూర్తయిన తర్వాత మిగిలిన కలుపు మొక్కలు తొలకరి వర్షాలకు అధికంగా విత్తనోత్పత్తి చేసుకుంటాయి. వేసవిలో తప్పనిసరిగా లోతైన దుక్కులు దున్నాలి. ఇలాంటి దుక్కుల వల్ల భూమిలో ఉన్న కీటకాలు, గుడ్లు, లార్వాలు చనిపోవడంతో పాటు గడ్డి జాతులు తుంగ గరికను అరికట్టవచ్చు. భూమిలోని పోషకాలు కూడా పెరిగి పంట దిగుబడి బాగా వస్తుంది. లోతైన దుక్కులతో కాకుండా వేసవిలో దుక్కు దున్నకుండా సాగుచేస్తే కొయ్యికుండాపోతుంది. ఏ పంట వేయాలన్నా ముందుగా దుక్కు దున్నాల్సిందే. విత్తేందుకు, నాటేందుకు అనుకూలంగా పొలాన్ని చదును చేసుకోవాల్సిందే. దుక్కి దున్నకుండా వదిలేయడం వల్ల భూమి సత్తువ కోల్పోతుంది.

**భూసార పరీక్షలు తప్పనిసరి**

ప్రతి రైతు వారివారి పొలంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఈ భూసార పరీక్షలు వల్ల భూమిలోనే పోషక విలువలు తెలియచేయడంతో పాటు దిగబడులకు అవసరమైన ఎరువులను ఏ మోతాదులో వాడాలో తెలుస్తుంది. తద్వారా పంట సాగు ఖర్చులు కూడా తగ్గుతాయి.

**మూడు రకాలుగా..**

భూమి దుక్కులను లోతుగా వాలుకు అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకెందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహిస్తుంది. నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల వాటి విసర్జిక పదార్థాలు సేంద్రీయ ఎరువులుగా మారి భూమిలోకి చేరుతాయి. భూసార వృద్ధికి తోడ్పడతాయి. గత పంటకు సంబంధించి ఆకులు మొదల్లు, చెత్తాచెదారం నేలలో తడిసిపోయి కలిసిపోయి సేంద్రీయ ఎరువుగా మారుతాయి. రాబోయే పంటకు కావాల్సిన పోషక పదార్థాలు అందుతాయి.

**నాణ్యమైన దిగబడులు**

ప్రస్తుత పరిస్థితులు పొలాలను రైతులు సేంద్రీయ ఎరువులు చల్లుకోవాలి. తొలకరింపు ముందే లోతు దుక్కులు దున్నుకొని పొలాలను సాగుకు సిద్ధం చేసుకోవాలి. తద్వారా వ్యవసాయంలో వాతావరం అవరోధాలు భూశాలు, కలుపు సమస్యలు సేంద్రీయ పద్ధతులు లాంటి అవరోధాలు దిగుబడిని దెబ్బతీస్తాయి. రైతులు ఎప్పటికప్పుడు సరికొత్త మెలకువలు పాటిస్తే అధిక దిగుబడును పొందవచ్చు.

**చెద పురుగు నశిస్తుంది**

రైతులు వేసవిలోని లోతైన దుక్కులు దున్నుకోవాలి. పొలానికి అడ్డంగా దున్నడం తో భూసారంలోని చెద పురుగులు నశించిపో తాయి. తగినంత తేమ ఉన్నప్పుడు దుక్కులు లోతుగా దున్నాలి. సేంద్రీయ ఎరువులు,రసాయనాలు వాడితే క్రిమి కీటకాలు పంటను ఆశించవు. క్రిమిసం హారిక మందులు వాడకుండా పండించడమే మంచిది.

### వేసవి దుక్కులలో రైతుకు మేలు

**కోట శివరామ కష్ణ, కషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, బెల్లంపల్లి.**



రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా పంట రక్షణ, అధిక దిగుబడి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందులో భాగంగానే రైతులు వేసవిలో లోతైన దుక్కులు చేసుకోవడం ద్వారా నెల ద్వారా సంక్రమించే చీడపీడలు నియంత్రించుకోవచ్చు అలాగే మిగిలిపోయిన కలుపు మొక్కలను పూర్తిగా నాశనం చేసుకొని తద్వారా కలుపు మందుల వాడకాన్ని తగ్గించుకొని ఖర్చులు తగ్గించుకొనే అవకాశం ఉన్నది.

## గనులపై మౌలిక వసతులను మెరుగుపరచాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులపై మౌళిక వసతులు మెరుగుపరచాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం ఆర్కె-5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో ఇప్పుడు దాదాపు యువ కార్మికులే ఉద్యోగాలు ఉన్నారని, వారు ఉన్నత చదువులు అభ్యసించి సింగరేణిలో ఉద్యోగాలు చేస్తున్నారని వారికి రెస్ట్ హాల్స్, సైకిల్ షేడ్స్, భోజనశాలలు ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యమైన పనిముట్లు అందించాలన్నారు. పెండింగ్లో ఉన్నటువంటి సిఎంపీఫ్ లోన్ల సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. సర్వీస్ అయిపోయిన ఎస్డీఎల్ యంత్రాల స్థానంలో నూతన ఎస్డీఎల్ యంత్రాలను తీసుకురావాలన్నారు. ఎస్డీఎల్ యంత్రాలలో నాసిరకం ఆయిల్ వాడడం వల్ల యంత్రాలు చెడిపోతున్నాయని, నాణ్యమైన ఆయిల్స్ వాడాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ ఖచ్చితంగా నెరవేరుస్తామన్నారు. కార్మికులందరూ భవిష్యత్తులో గుర్తింపు సంఘంగా ఏదేని హక్కుల సాధన కోసం పోరాటాలకు పిలుపునిస్తే కార్మికులు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, బద్రి బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శులు గుణిగంటి నర్సింగరావు, మురళి చౌదరి, సంఘం సదానందం, రామచందర్, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు లక్కిరెడ్డి సత్తిరెడ్డి, విజయ్, విశ్వనాథరెడ్డి, భోగ మధునయ్య, రమణ పాల్గొన్నారు.

## తిమ్మాపూర్‌లో కేంద్ర బృందం పర్యటన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు కేంద్ర బృందం సభ్యులు బుధవారం పర్యటించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, పల్లె ప్రకృతి, డంపింగ్ యార్డ్‌లను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టిక ఆహారం, ఇతర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో, ఉపాధి పనులు, మిషన్ భగీరథ తాగు నీరు, చెత్త ట్రాక్టర్ పనితీరు, రేషన్ పంపిణీ, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, డ్వాక్రా సంఘాల పనితీరు తదితర అంశాలపై ఆయా శాఖల, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సురేందర్‌రెడ్డి, కేంద్ర బృందం సభ్యులు అదుష్ కుమార్, శుభం, రోహన్, మను, ఆర్తి, గీతా, పంచాయితీ కార్యదర్శి ప్రశాంత్, కారోబర్ శివారాజు పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

రాబోవు వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం జీఎం బి సంజీవరెడ్డితో కలిసి శ్రీరాంపూర్ ఉపరితల గని, ఇందారం ఉపరితల గనిని సందర్శించి, ఉపరితల గని క్వారీలోని వ్యూ పాయింట్ నుంచి పని ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని సంపు ఏరియాలలో ఉన్న బొగ్గును వీలైనంత తొందరగా ఉత్పత్తి చేసి రవాణా చేయాలని అలాగే ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రణాళికలు సిద్ధం చేసుకుని వాటికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం 2024-2025లో ఉద్యోగులందరూ రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను సాధించాలని, ఉత్పత్తి సాధించే క్రమంలో ప్రతి ఒక్క ఉద్యోగి అధికారి రక్షణను మరువద్దని తెలిపారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలోని సీఆర్ఆర్, జీవీఆర్ కాంట్రాక్టర్ కంపెనీ వారు అలాగే ఇందారం ఉపరితల గని వరాహ కాంట్రాక్టర్ కంపెనీ వారు తీయవలసిన రోజు వారి ఓబి ఉత్పత్తి లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని, ఓబి ఎంత ఎక్కువ తీస్తే బొగ్గు అంతా ఎక్కువ ఉత్పత్తి రవాణా చేయడానికి అవకాశం ఉంటుందని సంబంధిత ఓబీ కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల రక్షణకు ప్రాధాన్యమిస్తుందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క ఉద్యోగి అధికారి తమకు నిర్దేశించిన విధులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారి ఎం శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారి టి శ్రీనివాస్, ఇందారం ఉపరితల గని మేనేజర్ రవి కుమార్, శ్రీరాంపూర్ ఉపరితల గని మేనేజర్ బ్రహ్మాజీ, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

## దాడి చేసన కాంగ్రెస్ నాయకులపై కేసు నమోగు చేయాలి



నవతెలంగాణ-జైపూర్

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. చెన్నూర్ మండలం సుద్దాల, కంచనపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల ఇండ్లలో చొరబడిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. దాడులకు పాల్పడిన వారి పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తూ అధికార కాంగ్రెస్ వత్తాసు పలుకుతున్న పోలీసుల తీరును ఖండిస్తున్నామని తెలిపారు. అధికారం కోల్పోయినంత మాత్రాన అధైర్యపడవద్దని ప్రజాల సమస్యలపై పార్టీ సూచనల మేరకు పోరాటం చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామ్‌లాల్ గిల్డా, ఎంపీపీ మంత్రి బాపు, కౌన్సిలర్ రేవెల్లి మహేష్, అనిల్, ఆసంపల్లి శ్రీనివాస్, మహిళా నాయకురాలు భారతి పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీఆర్ఎస్‌కు లేదు'

నవతెలంగాణ-జైపూర్

దోచుకోవడం..దాచుకోవడం తప్పా మరొకటి తెలియని బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడు రైతులను పట్టించుకోని నాయకులు రైతు ప్రభుత్వమైన కాంగ్రెస్‌ను విమ్మర్శించడం సిగ్గు చేటని అన్నారు. దొడ్డు వడ్లకు బదులుగా సన్న వడ్లు పండించడంలో రైతులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో కాంగ్రెస్ బోనస్ ప్రకటించిన విషయాన్ని గుర్తించలేని బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వాఖ్యలు చేయడం సరికదాని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్ని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలు కాకముందే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ప్రకటించిన హామీలు అమలు చేయడంలో కొంత ఆలస్యం అవుతుందని అన్నారు. కాంగ్రెస్‌లో టికెట్ అవకాశం లేకపోవడంతో బీఆర్ఎస్‌లో చేరిన డాక్టర్ రాజారమేష్ స్థాయికి మించిన విమ్మర్శలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌తోనే రాజకీయాల్లోకి వచ్చి అదే పార్టీని విమర్శించడం నీతిమాలిన చర్యగా అభివర్ణించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజోద్దీన్, లింగారెడ్డి, ఆవిడపు గణేష్, మంతెన లక్ష్మన్, శీలం వెంకటేష్, శ్రీకాంత్, అంబల్ల రవి, కల్కి రమేష్, బోండ్ల తిరుపతి రాజు, బాపురెడ్డి పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సీహెచ్‌పీ గనిలో సేల్ పికింగ్ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో గని ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఎస్ఈకి మెమోరాండం అందజేశారు. అనంతరం సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ సీహెచ్‌పీలో విధులు నిర్వహిస్తున్న సుమారు 16 మంది కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్టర్ గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని మండిపడ్డారు. కాంట్రాక్టర్ బిల్లు పెట్టకుండా వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టు కార్మికులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కాంట్రాక్టర్ బిల్లులు పెట్టిన సింగరేణి యాజమాన్యం సరైన టైంలో బిల్లులు చేయడం లేదని అన్నారు. సెల్ పికింగ్ టెండర్లను సింగరేణి యాజమాన్యం టెండర్ వేసే పద్ధతి సరిగ్గా లేక ఎవరైతే తక్కువ డబ్బులతోనే పనులు చేయించడానికి ముందుకు వస్తే వాళ్ళకి సింగరేణి యాజమాన్యం సేల్ పికింగ్ టెండరు ఇస్తుందని అన్నారు. చివరికి కాంట్రాక్టులు లాస్ అయి కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఎగ్గొట్టే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. టెండర్ పిలవడంలో సింగరేణి యాజమాన్యం మార్పులు తీసుకురావాలని, కాంట్రాక్టర్లు గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించి, ప్రతినెల 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరరావు, గిర్నాల శ్రీనివాస్, బైరి మల్లేష్, కార్తీక్, సంగతి సతీష్, ఎస్ కిష్టయ్య, రంజిత్, అప్పారావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు కాపాడాలి



నవతెలంగాణ-మంచిర్యాల

మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు గుర్తించి, వాటిని కబ్జా దారుల నుండి కాపడలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టణం లోని సర్వే నెం.140లో గల ప్రభుత్వ భూమిలో గతం లో ప్రకృతి వనాన్ని దాదాపు 5 లక్షల ఖరీదు చేసే మొక్కలుతో ఏర్పాటు చేస్తే ఆ ప్రభుత్వ భూమిని కొంత మంది భు కబ్జా దారులు నాయకుల ప్రోద్బలం తో భూమిని చదును చేసి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. సర్వే నెం.283లో గల ప్రభుత్వ భూమిలో హద్దులు చెరిపి వేసి గోడలు నిర్మించారని, అట్టి ప్రభుత్వ భూములపై విచారణ చేపట్టి భు కబ్జా దారుల నుండి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. లేని పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంకం నరేష్, రమేష్, తాజ్ పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మురిమడుగు గ్రామానికి చెందిన పడిగెల రాజన్న అనే గల్ఫ్ కార్మికుడు, ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి బుధవారం మురిబాడుగు గల్ఫ్ అసోసియేషన్ ద్వారా రూ.10 వేల, అలాగే గల్ఫ్ కార్మిక సంక్షేమ సమితి సభ్యులు రూ.7800 చందాలు వేసుకొని, మొత్తం రూ.17,800 బదిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా మురిమడుగు గల్ఫ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పూడూరి సతీష్ మాట్లాడుతూ గల్ఫ్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. 500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, గల్ఫ్ కార్మికులకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ అసోసియేషన్ క్యాషియర్ ఆకుల లాలయ్య, యూనియన్ సభ్యులు జగడాల శ్రీనివాస్, పడిగెల కొమురయ్య పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

• జిల్లా పశువైద్యాధికారి వై రమేష్‌కుమార్


నవతెలంగాణ-దండేపల్లి



సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశువులకు అనారోగ్య సమస్యలు ఉంటే స్థానిక పశువైద్యాధికారిని సంప్రదించాలని జిల్లా పశు వైద్యాధికారి వై రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం దండేపల్లి పశువైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిథిలావస్థలో ఉన్న పాత పశువైద్యశాలను ఆయన పరిశీలించారు. సిబ్బంది పనిచేయడానికి కూడా అణువుగా లేదని అన్నారు. ఏ క్షణాన కూలిపోతుందోనని భయంతో సిబ్బంది గడుపుతున్నారని స్థానిక సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి భవనం నిర్మాణం పూర్తయ్యే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి మాట్లాడారు. పాడి రైతులు ప్రభుత్వం ఉచితంగా అందించే జబ్బు వాపు, గొంతు వాపు, చిటిక వ్యాధి వంటి వాటికి టీకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం ఇప్పటికే మొదలైందని ఈ నెల 31 వరకు కొనసాగుతుందని వ్యాధి ప్రభావిత గ్రామాల్లో పశు వైద్య సిబ్బంది సందర్శిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డా.ధనరాజ్, పశువైద్య సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని తానిమడుగు, కుందేళ్ళపహాడ్ గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం లక్షెట్టిపేట సీడీపీఓ రేష్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం పాలు, గుడ్లను పరిశీలించారు. మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. టీచర్లుఅ ఎప్పటికప్పుడు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని పిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వాణి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | మే 23, 2024 | www.navatelangana.com

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ సిబ్బందికి పెండింగ్ వేతనాలు ఏడు నెలల ఏరియర్స్ డబ్బులు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సిబ్బందితో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడు నెలలుగా ఏరియాస్ పెండింగ్ ఉన్నాయని, జీతాలు కూడా ప్రతి నెల రావడం లేదన్నారు. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న నిర్వహించే డైరెక్టరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది షకిల్ పాల్గొన్నారు.

## మొగడ్ దగడ్‌లో చేపల చెరువులో విష ప్రయోగం

నవతెలంగాణ-కౌటల



మండలంలోని మొగడ్ దగడ్ గ్రామంలో గల చెరువులో మంగళవారం విష ప్రయోగం జరిగింది. గ్రామానికి చెందిన మత్స్యకారులు చెరువులో చేపలు పెంచుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తి చెరువులో విష ప్రయోగం చేయడంతో చెరువులోని చేపలు చనిపోయాయి. సుమారు రూ.50 వేల చేప పిల్లలను చెరువులో వేసినట్లు ఎర్మ సుధాకర్ తెలిపారు. విశ ప్రయోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పుస్తకాల రచయితగా ఆదర్శ ఉపాధ్యాయుడు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పాఠశాల స్థాయిలో విద్యార్థులు వాడే పాఠ్యపుస్తకాల డిజైన్ కోసం ఎస్‌సీఆర్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించే హైదరాబాద్ వర్క్ షాప్‌కు జిల్లాలోని ఆదర్శ పాఠశాల జంతు శాస్త్ర ఉపాధ్యాయుడు సతీష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాల విద్యార్థులు వాడే పాఠ్యపుస్తకాలు, క్వశ్చన్ బ్యాంక్ తయారు చేయడానికి ఈ నెల 23 నుండి 27 వరకు వర్క్ షాప్ జరుగుతుందని తెలిపారు. వర్క్ షాపుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

## వివాహిత అదృశ్యం

నవతెలంగాణ-వాంకిడి



వివాహిత అదృశ్యం అయిన కేసు నమోదైనట్టు ఎస్సై తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిచేపల్లి గ్రామానికి చెందిన గేడం కాంతారావ్, సీమతో పదేండ్ల క్రితం వివాహం అయింది. ముగ్గురు పిల్లలున్నారు. భార్యభర్తల మధ్య తరుచు గొడవలు జరిగేవి. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. పుట్టింటికి వెళ్లిపోతానని చెప్పి ఇంట్లోనుంచి వెళ్లిపోయింది. రాత్రి తల్లిఇంటికి ఫోన్ చేసి విచారించిన అక్కడి రాలేదని తెలియడంతో భర్త కాంతారావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని ఎంపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గోవింద్ రాథోడ్ కుటుంబానికి మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ బుధవారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ గోవింద్ రాథోడ్ తండ్రి రాథోడ్ ప్రభు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బంజారా సామాజిక కార్యకర్తగా ప్రభు రాథోడ్ మంచి సేవలు అందించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## 60 శాతం రాయితీపై జీలుగ విత్తనాలు

నవతెలంగాణ-బెజ్జూర్

60 శాతం రాయితీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని బెజ్జూర్ వ్యవసాయ అధికారి రాజుల నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 కేజీల జీలుగ విత్తనం బస్తా ధర రూ.1116 ఉంటుందని తెలిపారు. బెజ్జూర్ మండల కేంద్రంలో జీలుగ విత్తనాలు ఉన్నాయని, ఆసక్తిగల రైతులు పట్టేదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు మొబైల్ నెంబర్‌తో ఏఈఓను సంప్రదించాలని కోరారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రాల్లోని సందీప్ నగర్ గోండుగూడలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం కాలనీలో నివాసం ఉంటున్న కృసంగి సాయికుమార్ కొంతకాలంగా సరిగా పనిచేయక రోజు తాగి ఇంటికి వస్తుండేవాడు. ఇదే క్రమంలో మృతుడి తల్లి గంగుబాయి మంగళవారం మందలించగా సాయికుమార్ ఇంట్లోని దూలానికి ఉరేసుకున్నాడు. పని నిమిత్తం బయటకు వెళ్లి వచ్చిన గంగుబాయి సాయికుమార్‌ను చూసి చుట్టుపక్కల వారిని పిలిచి పోలీసులకు సమాచారం అందించింది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## విలేకరిపై దాడికి డీటీఎఫ్ ఖండన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆదాబ్ హైదరాబాద్ దినపత్రిక విలేఖరి అంగల తిరుపతిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుర్గం విస్తారు, కార్యదర్శి నాందేవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల చారిగాం సమీపంలో సహజ వనరులైన ఇసుక, మొరం అక్రమంగా తవ్వుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న మాఫియా అక్రమాలపై వార్తలు రాయడానికి వెళ్లిన విలేకరిపై దాడి చేయడం అమానుషమని పేర్కొన్నారు. ఇట్టి దాడిని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని కోరారు. ప్రకృతి వనరులు దుర్వినియోగం కాకుండా అధికారులు నిరంతరం నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు.

## నేడు జిల్లా స్థాయి నెట్ బాల్ సీనియర్ సెలక్షన్స్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం సీనియర్ నెట్ బాల్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు అలీబిన్ హైమద్, జిల్లా కార్యదర్శి బి.తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికకు వచ్చే అభ్యర్థులు ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోస్ తీసుకొని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు రావాలని, మిగతా వివరాలకు 9949300668 నెంబర్ సంప్రదించాలని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని 33 కేవీ లైన్ పెద్దబండ నుండి లోనవెల్లి సబ్ స్టేషన్ వరకు లైన్ మరమ్మత్తులు పనుల కారణంగా గురువారం ఉదయం 8.30 గంటల నుండి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇర్ఫాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిర్పూర్, కౌటాల, చింతలమానపల్లి, బెజ్జూరు మండలాలలో అంతరాయం ఉందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు

- 70 కిలోల పత్తి విత్తనాలు స్వాధీనం..
- నలుగురి నిందితుల్లో ఒకరి అరెస్టు ముగ్గురు పరార్
- వివరాలు తెలియజేసిన టాస్క్‌ఫోర్స్ సీఐ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

వానాకాలం సీజన్ ప్రారంభంలోనే నకిలీ పత్తి విత్తనాలను గట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మండలంలోని గూడెం గ్రామం మీదుగా మహారాష్ట్రలోకి తరలిస్తున్న 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్ ఫోర్స్ సీఐ రాణ ప్రతాప్ పట్టుకున్నారు. గూడెం మీదుగా మహారాష్ట్రకి పత్తి విత్తనాలు ద్విచక్ర వాహనంపై తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు గూడెం గ్రామం వద్ద వాహనాలను తనిఖీ చేయగా బైక్ వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసును గమనించి బైక్‌పై ఉన్న పత్తి విత్తనాల రెండు సంచులను కింద పడేసి పారిపోవడానికి ప్రయత్నించిన క్రమంలో వారిలో ఒక్కరిని పట్టుకున్నారు. అతన్ని విచారించగా మండలంలోని గంగాపూర్ గ్రామం చెందిన చపిలే వినోద్‌గా గుర్తించారు. పారిపోయిన మిగితా ముగ్గురు చపిలె పురుషోత్తం, గంగాపుర్ బొల్లబోయెన అశోక్, బొల్లబోయెన క్రిష్ణ సిర్పూర్(టి) మండలం భూపాలపట్నంకు చెందిన వారుగా విచారణలో తెలుసుకున్నారు.




పట్టుకున్న నకిలీ విత్తనాలు, నిందితునితో పోలీసులు

నలుగురు ఉండగా ముగ్గురు పరారీలో ఉన్నారని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ దాదాపుగా రూ. లక్ష 50 వేలు ఉంటుందన్నారు. అమాయక రైతులను మోసం చేసే వారిని, జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు అమ్మేవారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపాదికన వసతులు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- పర్ధాన్ గూడ పాఠశాల సందర్శన



పాఠశాలలో వసతుల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని కోసిని పంచాయతీ పర్ధాన్ గూడ పాఠశాలలో పూర్తిస్థాయిలో మౌళిక వసతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని పర్ధాన్ గూడ పాఠశాలలోని మౌళిక వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన పాఠశాలల్లో వసతుల కల్పనలో భాగంగా పర్ధాన్ గూడ పాఠశాలకు గిరిజన సంక్షేమశాఖ నిధులు రూ. 6.14 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో పాఠశాలలో మరుగుదొడ్లు, తలుపులు బిగించడంతో పాటు నేల మరమ్మతులు పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు ఇంజనీరింగ్ శాఖ అధికారుల సమక్షంలో సానుకూలంగా చేపట్టాలని సూచించారు. గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న కొంత మంది ఉపాధ్యాయులు మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్ రాకపోకలు నిర్వహిస్తున్నందున పాఠశాలల్లో సమయపాలన పాటించడం లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా మాట్లాడుతూ గిరిజన పిల్లలు చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలనే ఆశయంతో 5 నుంచి 12 వ తరగతి వరకు వసతితో కూడిన విద్యానందిస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ గౌరీశంకర్, ఏఈ బద్రోద్దీన్ పాల్గొన్నారు.

# ఐటీడీఏ ఉద్యాన నర్సరీలను అభివృద్ధి చేస్తాం

- ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీలను బలోపేతం చేయటంతో పాటు అభివృద్ధి చేస్తామని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి కుష్బు గుప్తా అన్నారు. బుధవారం మండలంలోని జంబుగాలోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీ, శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. నర్సరీలో సాగు చేస్తున్న మామిడి, నిమ్మ, జామ, సపోట పండ్ల తోటలను పరిశీలించారు. నర్సరీ ద్వారా మెరుగైన ఆదాయం పొందటంతో పాటు గిరిజన రైతులకు, దినసరి కూలీలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్‌కు సూచించారు. నర్సరీలో ఉన్న ఖాళీ స్థలాలను వివిధ రకాల పంటలు సాగు చేయాలని, రైతులకు ఆదాయం వచ్చే పంటలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నర్సరీలో పెంచుతున్న మామిడి, అలంకరణ మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సుధీర్ కుమార్, సిబ్బంది సాయి రాజ్, రమేష్ పాల్గొన్నారు.



ఉద్యాన నర్సరీ వివరాలు తెలుసుకుంటున్న పీఓ గుష్బు గుప్తా

# ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

- డీఎంహెచ్‌ఓ తుకారాం భట్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ తుకారాం భట్

నవతెలంగాణ-కెరమెరి

ప్రభుత్వ ఆస్పత్రిల్లోనే ప్రసవాలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి తుకారాం భట్ అన్నారు. బుధవారం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పరిశుభ్రత, రోగులకు అందుతున్న ఓపీ వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. రోజు వారీగా ఓపీ సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు సాదరణ ప్రసవాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు పడవద్దన్నారు. వంద శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా కృషి చేయాలన్నారు. గర్భిణీలు వివిధ పరీక్షలు సకాలంలో చేయించుకొని ప్రభుత్వ వైద్య సేవలు పొందాలన్నారు. ఇమ్యూనైజేషన్( పిల్లలకు టీకాలు) సకాలంలో అందేలా చూడాలన్నారు. బీపీ, షుగర్ పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సమచారాన్ని ప్రజలకు అందించాలన్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. అదే విధంగా ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు క్రాంతి, ఎంఎల్‌హెచ్‌పీ రాందాస్, లలిత, ఏఎన్ఎం రాధ లక్ష్మీ పాల్గొన్నారు.

# అడవుల రక్షణలో భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అడవులు రోజురోజుకు అంతరించి పోతున్నందున వాతావరణ సమతుల్యం దెబ్బతిని ఎన్నో అనార్థలను ఎదుర్కొవాల్సి వస్తున్నందని, అడవుల రక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కాగజ్‌నగర్ ఇన్‌చార్జి డివిజన్ అధికారి అప్పలకొండ సూచించారు. బుధవారం ఆటవీ డివిజన్ కార్యాలయంలో ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై ఉన్న జీవరాశులను కాపాడుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సృష్టిలో అన్నింటిలో ఏకత్వం ఎంత ఉందో, భౌతికంగా, మానసికంగా భిన్నత్వం కూడా అంతే ఉందని తెలిపారు. జీవరాశుల్లో ఏ ఒక్కటి అధికం, ఏదీ తక్కువ కాదని తెలిపారు. మనిషి ప్రతి అవసరానికి ప్రకృతిపై ఆధారపడి జీవిస్తున్నాడని, ప్రకృతి లేనిదే మానవ మనుగడ లేదని చెప్పారు. గొలుసుకట్టు విధానంలో జీవరాశులు జీవిస్తున్నాయని పేర్కొన్నారు. అంతకు ముందు డివిజన్ కార్యాలయం నుంచి రాజీవ్‌గాంధీ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ప్రతి ఒక్కరు అడవుల రక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కాగజ్‌నగర్, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్ రేంజ్ అధికారులు రమాదేవి, పూర్ణచందర్ రావు, సుధాకర్, ఎఫ్ఎస్‌ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి మహనీయుల స్ఫూర్తితో పోరాటాలు చేద్దామని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు దుంపల రంజిత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ముల్కల్లగూడా వద్ద కె రాజన్న, పోతు శంకర్‌ల మూడో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జన్నారం మండల కేంద్రంలో నివాసం ఉంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత 30 సంవత్సరాలుగా అనేక భూ పోరాటాలు, ప్రజా, కార్మిక పోరాటాలు, చేసి ప్రజలకు భూములు ఇప్పించిన ఘన చరిత్ర వారిదని కొనియాడారు. అంతేకాకుండా జన్నారం మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయించి గుడిసె వాసులకు పట్టాలు ఇప్పించారని అన్నారు. పోరాటాల కాలంలో అనేక కేసులకు లెక్కచేయకుండా నిరంతరం పేద ప్రజల శ్రేయస్సు కొరకే తమ జీవితాన్ని అంకితం చేసి పూర్తి కాలం కార్యకర్తగా పనిచేశారన్నారు. నిరంతరం ప్రజల కోసమే తమ ఊపిరి ఆగే వరకు పోరాటం చేసిన గొప్ప నాయకులు, వారు మహమ్మారి కోవిడ్ వల్ల ఇద్దరు మరణించడం పార్టీకి తీరని లోటు అన్నారు. వారి ఆశయాలను జిల్లాలో మరింత ముందుకు తీసుకెళ్లి వారి అడుగుజాడల్లో ప్రజా, కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటం చేయడమే వారికి మనం ఇచ్చే ఘన నివాళిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు లక్ష్మి, పోసమ్మ, మల్లవ్వ పాల్గొన్నారు.

## నీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



నవతెలంగాణ-జన్నారం

మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తిందని కాలనీవాసులు బుధవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. గ్రామ కార్యదర్శికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మిషన్ భగీరథ పైప్ నుంచి తమకు కనెక్షన్ ఇస్తే, ఈ కాలనీకి నీటి సరఫరా జరుగుతుందన్నారు. కాని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా మిషన్ భగీరథ పైపులను కనెక్షన్ ఇవ్వకపోవడంతో, ఈ కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. కాలనీలో ఉన్న బావులన్నీ పూర్తిగా ఎండిపోయాయన్నారు. ఒక్క బోరు బావి కూడా లేదన్నారు. అలాగే గ్రామంలోని అంబేద్కర్ నగర్ దుబ్బగూడెంలలో కూడా తీవ్ర నీటి ఎద్దరి ఉందని, అధికారులు స్పందించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు జాడి రవి, లక్ష్మి, శ్రీలత, సుమలత, నాగలక్ష్మి పవన్, బోర్రయ్య, రాజలింగు పాల్గొన్నారు.

## పాఠశాలల మరమ్మతు పనులపై ప్రత్యేక దృష్టి

- నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలి
- జిల్లా విద్యాధికారి యాదయ్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమ్మ ఆదర్శ పాఠశాలల' అభివృద్ధి పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి యాదయ్య ఆదేశించారు. బుధవారం లక్షెట్టిపేట మండలాలలోని పలు పాఠశాలలను ఆయన పరిశీలించారు. బలరావ్‌పేట, కొత్తపల్లి, గాంధీనగర్, మోదెల ప్రాథమిక పాఠశాల్లో చేపట్టిన పనులను పర్యవేక్షించారు. అదేవిధంగా జెండా వెంకటాపూర్, చందారం, లక్షెట్టిపేట అర్బన్ స్టిచ్చింగ్ సెంటర్లలో విద్యార్థులకు కుడుతున్న యూనిఫాంలను పరిశీలించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి పాఠశాలలకు అందజేయాల్సిందిగా సూచించారు. మరుగుదొడ్లు, మూత్రశాలల, నిర్మాణాలు, మరమ్మతులు ఇతర పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై లోపు సదరు పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి చౌదరి, ఏఈ విక్రంరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు..

## జనగామ జిల్లాకు పాపన్న గౌడ్ పేరుపెట్టడం అభినందనీయం

నవతెలంగాణ-జన్నారం

జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జనగామ జిల్లాగా మారుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని మోకు దెబ్బ రాష్ట్ర నాయకులు బాలసాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ, జనగామ జిల్లాలో పుట్టిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ భారతదేశ మొట్టమొదటి దళిత బహుజన విప్లవ వీరుడు అన్నారు. గౌడ కులంలో పుట్టి దాదాపు 20 కోటలు నిర్మించి మొగల్ పాలకులను గడగడ లాడించిన మహారాజు పాపన్నగౌడ్ అన్నారు. గత 30 సంవత్సరాలుగా మోకు దెబ్బ ఆధ్వర్యంలో జనగామ జిల్లాకు పాపన్న గౌడ్ జిల్లా నామకరణం కోసం పోరాడమని ఈ రోజు ఆ కలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా కుల ఆత్మగౌరవాన్ని గుర్తించి పాపన్న జనగామ జిల్లాగా పేరు పెట్టడాన్ని స్వాగతిస్తూమన్నారు. బహుజన కులాల తరపున మా గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ తరపున రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అదేవిధంగా మా గౌడ కులస్తుల సమస్యలన్నిటిని పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మోకు దెబ్బ డివిజన్ అధ్యక్షులు ఒల్లాల నరసాగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరుకల రమేష్‌గౌడ్, పానకల్ పట్టణ అధ్యక్షుడు పోడేటి సతీష్‌గౌడ్, ఎరుకల శంకర్‌గౌడ్, కోట రవిగౌడ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | మే 23, 2024 | www.navatelangana.com

## బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మామడ మండలం నల్దుర్తి గ్రామ మాజీ సర్పంచ్ భర్త శంకర్‌రెడ్డి మంగళవారం మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు బుధవారం పరామర్శించారు. బాధితుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీహరిరావు వెంట వైస్ ఎంపీపీ లింగారెడ్డి, సీపీసీఎస్ మాజీ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, నాయకులు రఫీ, బాపయ్య, లింగారెడ్డి, మంగు లింగన్న, సల్కం శేఖర్, రెడ్డి నర్సారెడ్డి, రాజు పాల్గొన్నారు.

## ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జీలుగు విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవ కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు బుధవారం జీలుగా, జనుముల విత్తనాల పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత తెలిపారు. ప్రతి రైతుకు 40కేజీల జనుము, 30 కేజీల జీలుగుల బస్తలను ఇస్తున్నట్లు తెలిపారు. కావలసిన రైతులు పట్టా పాస్‌బుక్ ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, తీసుకొని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రైతులకు కావలసిన, జీలుగా, జానుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. బుధవారం ప్రజా సంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి దొడ్డు రకానికి రూ. 500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందని ఆరోపించారు. వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించి, నేడు అది సన్నపు వడ్లకు మాత్రమే అని ప్రకటించడాన్ని జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వరి ధాన్యానికి సన్న రకానికి రూ.500 బోనస్ చెల్లిస్తాం అనడం రైతులను మోసం చేయడమే అన్నారు. కాంగ్రెస్ హామీలు రైతంగానికి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండటం వల్ల ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. కానీ ఆరు నెలలు పూర్తికాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కుతుందని విమర్శించారు. ఇప్పటికే పెన్షన్లు కానీ పేద మహిళలకు రూ.2500, రైతాంగానికి రూ.15,000 రైతు బంధు రాలేదన్నారు. రైతాంగాన్ని ప్రజల్ని మోసం చేసే కుట్రని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రజలకు జవాబు దారిగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డాకుర్ తిరుపతి, నాయకులు చందుల సాయి కిరణ్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో టౌన్ ఏఈ కమలాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల నుర్వహణ, విద్యుత్ తీగల వద్ద చెట్ల తొలగింపు పనుల కారణంగా మేరాజ్ మజీద్, దోబీఘాట్, ఎల్‌బీఎస్ మార్కెట్ ఏరియాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## భాగ్యరెడ్డి వర్మ చిరస్మరణీయుడు

నవతెలంగాణ-నస్పూర్




దళిత వైతాళికుడు, సంఘసంస్కర్త అయిన భాగ్యరెడ్డి వర్మ దళిత బాలికల పాఠశాలలను స్థాపించి బాలిక విద్యకు చేసిన కృషి అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతిని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అసమాన తలను తొలగించి దళిత బాలికలకు విద్యను అందించేందుకు 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి బాలికల అభివృద్ధి కోసం విశేష కృషి చేశారని అన్నారు. వివిధ సంఘాలు, మండలిలను స్థాపించి సంఘసంస్కరణ కోసం ఎంతో కృషి చేశారని, ప్రజలకు సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ అందించేందుకు ధనవంతుల పాత్ర పోషించారని అన్నారు. నిరక్షరాస్యత వల్ల ప్రజలు ఎంతో వెనకబడి ఉన్నారని వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది దేశాభివృద్ధికి పాటుపడాలని ఆదర్శంగా నిలిచారని అన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, మహనీయులు ఆచరించిన మార్గాలను అనుసరించడం ద్వారా దేశాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత, లీడ్ డిస్టిక్ మేనేజర్ తిరుపతి, కలెక్టరేట్ ఏఓ పిన్న రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, సి సెక్షన్ పర్యవేక్షకులు సంతోష్, పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట :** దళిత చైతన్య వైతలీకుడు, సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఉత్కూర్‌లోని అంబేద్కర్ చౌరస్తా సర్కిల్‌లో అంబేద్కర్ సంఘం నాయకులతో భాగ్యరెడ్డి వర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1906-1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడన్నారు. అంబేద్కర్ జ్యోతిరావు పూలేల నుంచి ప్రేరణ పొందిన తర్వాత వర్మ అగ్రవర్ణాల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. దేవదాసి ప్రాంతానికి వ్యతిరేకంగా వర్మ ఉద్యమాన్ని ప్రారంభించి నిజాంను నేరంగా ప్రకటించాలని ఒత్తిడి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల ఉపాధ్యక్షుడు బైరం లింగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, కండే మొగిలి, చిన్న, సునీల్, సతీష్ పాల్గొన్నారు.

## చివరి గింజవరకు కొనుగోలు చేస్తాం

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల మేరకు రైతుల వద్ద నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 286 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ఇప్పటి వరకు జిల్లాలో 15 వేల 839 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 5 వేల 26 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసి రూ. 122 కోట్ల 3 లక్షల సంబంధిత రైతు ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు సమయంలో రైతుల సంబంధిత వివరాలు, విక్రయించిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేస్తున్నామని తెలిపారు. ధాన్యం తరలించేందుకు అవసరమైన గన్నీ సంచులు, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన వరిధాన్యంను ట్యాగింగ్ చేయబడిన రైస్‌మిల్లులకు కేటాయించిన మేరకు తరలించడం జరుగుతుందని తెలిపారు.

## గ్రామాల్లో పనుల నిర్వహణ కొనసాగాలి

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచయతీల పరిధిలో పారిశుధ్య, అభివద్ధి పనుల నిర్వహణ నిరంతరం కొనసాగాలని అదనపు డీఆర్‌డీఓ దత్త రామ్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్‌తో కలిసి మండలంలోని ఇందారం, ముదిగుంట, జైపూర్‌లలో పర్యటించారు. ఇందారంలో కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన వివిధ గ్రామాలలో ఏర్పాటుచేసిన నర్సరీలు పరిశీలించారు. యేసయ్య ఎండలు మండిపోతున్నందున ప్రతిరోజు రెండుసార్లు మొక్కలకు నిరంధించాలని సూచించారు. ఉంగరంలో తాగునీటి సరఫరా తీరుని పరిశీలించిన ఆయన తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యు ఎస్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

# ఎన్నికల ఉపాధి ముగిసింది..!

- నెల రోజులకు పైగా నాయకుల వెంట ప్రచారం
- తిరిగి ఎవరి పనులకు వారు

నాయకుల వెంట నడిచే కార్యకర్తల సంఖ్యను బట్టి నాయకుడి బలాన్ని అంచనా వేసే సంస్కృతి పెరిగింది. దీంతో ఆ పది మంది కోసం నాయకులు తహతహలాడుతుంటారు. ఎన్నికల సమయంలో చేపట్టే ప్రదర్శనలకు జనాల సమీకరణ ప్రహసనంగా మారింది. దీంతో నేతలను అనుసరించే చోటా నాయకులకు బాగా డిమాండ్ పెరిగింది. ఎన్నికలు రావడంతో వారికి ఉపాధి అవకాశాలు తెచ్చిపెట్టాయి. పార్టీ జెండా పట్టుకుని నాయకుని వెంట తిరిగితే రోజుకు రూ.500 వరకూ గిట్టుబాటు అయింది. పట్టణాల్లో ఈ తంతు నిరంతర ప్రక్రియగా కొనసాగింది. పురుషుల కంటే మహిళలను ఎక్కువ సంఖ్యలో తరలించి తమ వెంట తిప్పడానికి నాయకులు మక్కువ చూపించారు.

నవతెలంగాణ-హాజీపూర్

పురుషుల కంటే మహిళలకు ఇచ్చే కూలి రెండు నుంచి మూడు గంటలకు రూ.200 నుంచి రూ.300 ఉండగా, పురుషులకు అదే కూలి ఇస్తూ మందు బాటిల్ కూడా ఇవ్వాల్సి వచ్చింది. దీంతో మహిళలను సభలకు, ర్యాలీలకు ఎక్కువగా తరలించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నాయకుని పిలుపుతో కదిలి వచ్చే జనాలను తరలించే వారి పంట పండింది. ఎండలో అలసిపోతే మజ్జిగ ప్యాకెట్లు, శీతల పానీయాలు, మధ్యాహ్నం భోజనంతో నెల రోజులకు పైగా ఎన్నికల ఉపాధి లభించింది. ఎన్నికల జాతర మొదలైన నాటి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల కూలీలకు డిమాండ్ బాగా పెరిగింది. సభలకు, ర్యాలీకి ఎంతమంది అవసరం, ఎన్ని గంటల పాటు ఉండాలన్న ప్రాతిపదికన చెల్లింపులు చేశారు. నాయకులు అవసరాన్ని బట్టి ఉదయం ఏడు గంటలకే ప్రచారంలో, ర్యాలీ, సభలో పాల్గొనే వారి పేర్లను రాసుకోవడం, ప్రక్రియ ముగిసిన తర్వాత నగదు చెల్లింపులు చేయడం పరిపాటిగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో పలువురు సభలు, ర్యాలీలకు వెళ్లే ఎన్నికలు ఉపాధి కూలీలుగా మారిపోయారు. తమకు మేలు చేస్తారన్న నేతల వెంట నడుస్తూనే, వారి ఇచ్చే తాయిలాలు పుచ్చుకునే సంస్కృతి ఈ ఎన్నికల్లోనూ కొనసాగింది. ఇప్పుడు ఎన్నికల క్రతువు ముగియడంతో మళ్లీ ఎవరి పనులకు వారు వెళ్తున్నారు. మంచిర్యాల జిల్లా పరిధిలో మూడు పార్టీలు సభలకు సమావేశాలకు భారీగా జనసమీకరణ చేశాయి. దీని కోసం కోట్లలో ఖర్చు చేశాయనే ప్రచారం ఉంది. జిల్లా కేంద్రంలోని కూలీల అడ్డాలో ఎన్నికల ప్రచార సమయంలో కిక్కిరిసి పోయేది. పనులకు కూడా కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది.

# పాత నేరస్తులపై నిఘా ఉంచాలి : ఎస్పీ



- దీర్ఘకాలికంగా పెండింగ్ కేసులను దర్యాప్తు చేపట్టాలి
- నకిలీ విత్తనాలపై నిఘా పెట్టాలి
- లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- నెలవారీ నేరసమీక్ష సమావేశం
- జిల్లా ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా దర్యాప్తు పూర్తిచేసి కోర్టులలో చార్జ్ సీటు దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. బుధవారం పట్టణంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించగా ఎస్పీ పాల్గొన్నారు. ముందుగా పార్లమెంట్ ఎన్నికలను ఎటువంటి అసాంఘిక సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసినందుకు సిబ్బందికి అందరికి అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు కృషి చేసిన పోలీసు అధికారులందరికీ ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రస్తుతం నకిలీ విత్తనాలను అరికట్టడంలో జిల్లా పోలీసులకు, వ్యవసాయ అధికారులతో కలిసి సంయుక్తంగా ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక కార్యచరణను అవలంబించాలని అధికారులకు సూచించారు. రానున్న లోక్ అదాలత్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకొని ఎక్కువ శాతం కేసులను పరిష్కరించే దిశగా రాజీకి సిద్ధంగా ఉన్న వారిని రాజీ చేసుకొనే విధంగా సహకరించాలని సూచించారు. పోక్సో కేసులలో ప్రత్యేక దృష్టి సారిస్తూ బాధితులకు న్యాయం చేకూరాలంటే నేరస్తులకు శిక్షలు పడే విధంగా సరైన దర్యాప్తును, నిర్ణీత కాలంలో పూర్తిచేయాలని సిబ్బందికి తెలియజేశారు.

**సైబర్ క్రైమ్ తీరును ప్రజలకు అవగాహన కల్పించాలి...**

జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు అవలంబిస్తున్న తీరును, సైబర్ క్రైమ్ జరుగుతున్న తీరును ప్రజలకు అవగాహనను కల్పించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, ఈ సందర్భంగా సైబర్ క్రైమ్‌పై అవగాహనతో ఉన్న ఒక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోస్టర్‌ను జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా సెల్‌ఫోన్ మిస్సింగ్ కేసులలో సీఈఐఆర్‌ను ఉపయోగిస్తూ బాధితులకు పోయిన సెల్‌ఫోన్లను త్వరగా తిరిగి అందజేసేలా కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి సాగుపై, వినియోగంపై ప్రజలకు అవగాహనను కల్పిస్తూ దాని ద్వారా కలిగే అనర్థాలను తెలియజేయాలన్నారు. ప్రజలు గంజాయి సాగుకు పాల్పడినట్లయితే ప్రభుత్వ పరంగా వచ్చే ప్రయోజనాలను దూరమవుతారని తెలియజేయాలన్నారు. ముఖ్యంగా శాంతి భద్రతలను పరిరక్షించే క్రమంలో సిబ్బంది 24 గంటలు అప్రమత్తతో విధులను నిర్వర్తించాలని, కేటాయించిన విధులను తప్పనిసరిగా పాటిస్తూ ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా ఉత్తమమైన ప్రతిభ కనబరచాలని సూచించారు. సోషల్ మీడియాను అనుక్షణం పరిశీలిస్తూ ఎటువంటి అసత్య ప్రచారం కాకుండా, రెచ్చగొట్టే విధంగా ఉండే పోస్టుల విషయంపై పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీటీసీ సమయ్ జాన్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, కే సురేందర్ రెడ్డి, బి.ప్రకాష్, హసీబుల్లా, సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ కార్యాలయం పరిపాలనాధికారి భక్త ప్రహ్లాద, ఎ.సూపరింటెండెంట్ సంజీవ్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, డీసీఆర్బీ, ఐటి కోర్, సిబ్బంది పాల్గొన్నారు.

# మండలంలో గాలివాన బీభత్సం

- గాల్లోకి ఎగిరిన ఇనుప రేకులు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు



తాంసి

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన ఝరిపూనగూడ, ఉమ్రి, కోసాయి, దేగామ, కప్పర్‌దేవి గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఇంటి రేకుపై కప్పులు గాల్లోకి ఎగిరాయి. ఈదురు గాలులు వీచడంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. ముఖ్యంగా గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు కొన్ని కిందపడగా అందులో కొన్ని స్తంభాలు వంగిపోయాయి. దీంతో విద్యుత్ తీగలు తెగిపోయి, గాలి బీభత్సం సృష్టించినట్టు గ్రామస్తులు తెలిపారు. గాలివానకు డోర్లి రైల్వే గేట్ నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు కిరువైపులా చెట్లు గాలికి విరిగిపోవడంతో బస్సు గ్రామాలకు వెళ్లకుండా తిరిగి వచ్చినట్టు ప్రయాణికులు తెలిపారు. కొంతమంది గిరిజన మహిళలు ఏమి జరుగుతుందోనని కేకలు వేస్తూ, పక్క ఇండ్లకు పరుగులు తీశారు. ఓ గిరిజన గ్రామంలో సుమారు 30 నుంచి 40 ఇండ్ల రేకులు గాలిల్లోకి లేచిపోయినట్టు తెలిపారు. పేదరికంలో ఉన్న గిరిజనులను ఆదుకోవాలని మండల గిరిజన నాయకులు జ్ఞానేశ్వర్, మాధవ్, జిల్లా అధికారులతో పాటు పాలకులను కోరారు.

**నార్నూర్ :** మండలంలోని పూసిగూడ, జామడ, బలాన్‌పూర్, నాగల్‌కొండ, గుంజాల, గంగాపూర్, తాడిహత్నూర్ తదితర గ్రామాల్లో బుధవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి గంట సేపు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు చల్లటి వాతావరణంతో కాస్త ఉపశమనం లభించింది.

**తాంసి :** తాంసి, భీంపూర్ మండలాల్లో బుధవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. తాంసి సబ్ మార్కెట్ యార్డులో జొన్నలు కొనుగోలు కొనసాగుతుందని, రైతులు మార్కెట్‌కు తీసుక వచ్చిన జొన్నలకు మార్కెట్ యార్డులో స్థలం లేక రోడ్డుపై కుప్పలు పోశారు. అకాల వర్షం కురువడంతో జొన్న కుప్పలు తడిసిపోయాయి. మండల కేంద్రానికి చెందిన కుంటాల స్వామికి చెందిన ఇంటిపై ఈత చెట్టు పడటంతో ఇల్లు కూలిపోయి. ఇంట్లో ఉన్న వస్తువులు అన్ని తడిసిపోయాయి. ఇంట్లో ఉన్న వారు ప్రాణాలతో బయటపడ్డారు.

**బోథ్ :** మండల కేంద్రంతో పాటు నిగిని, సాకేర, సొనాల, కౌట, కనుగుట్ట, మర్లపల్లి, బాబెర, గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని రోడ్డు పక్కన చేనులలో చెట్లు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రైతులకు చెందిన జొన్న, మొక్కజొన్న, పంటలు వర్షానికి భారీ నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన పంటకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని పరిశీలించి, నష్టపరిహారం అందజేయాలని కోరారు.



తలమడుగు



తలమడుగు

## మహిళపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు



నవతెలంగాణ-మందమర్రి

కులం పేరుతో దూషించిన మహిళపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 18వ తేదీన సాయంత్రం మందమర్రి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన అక్కపాక శంకర్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన చంద్రకళ అనే మహిళ పాలచెట్టు ప్రాంతం వద్ద కులం పేరుతో దూషించడంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు. దర్యాప్తులో భాగంగా బుధవారం బెల్లంపల్లి ఏసీపీ సంఘటన స్థలాన్ని సందర్శించి సాక్షులను విచారించారు.

## తాపీ మేస్త్రీ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఉట్నూర్

తాపీ మేస్త్రి మండల నూతన కమిటీ ఎన్నుకున్నట్టు కమిటీ గౌరవ అధ్యక్షులు గొల్లపెల్లి నర్సయ్య తెలిపారు. బుధవారం పట్టణంలోని తాపీ మేస్త్రీ భవనంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా జాడి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా పందిరి నర్సయ్య, బొస్లె మహదేవ్ ప్రధాన కార్యదర్శిగా పెరుమల్ల వెంకటేష్, కరడి భూమన్న, సంయుక్త కార్యదర్శిగా మహేందర్, దర్గయ్య, లక్ష్మిపతి కోశాధికారిగా పోశన్న, రవి సభ్యులుగా గంగాధర్, జైపాల్, సాగర్‌లను ఎన్నుకున్నారు. మాపై నమ్మకం ఉంచి మాకు కమిటీ అధ్యక్షుడిగా, కార్యదర్శి, సభ్యులుగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అధ్యక్షులు జాడి రాజేశ్వర్‌ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ముగిసిన పాలిసెట్ శిక్షణ శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నెల రోజులుగా ఆర్యవైశ్య టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక్‌చౌక్‌లోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహిస్తున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఉచిత శిక్షణ శిబిరం ముగిసింది. బుధవారం ముగింపు సందర్భంగా ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు కొత్తవార్ రాజేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను సత్కరించి వారి సేవను కొనియాడారు. అన్ని దానల్లో విద్య గొప్పదని భావించి ఆర్యవైశ్య టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వడం అబినందనీయమని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొత్తవార్ రాజేశ్వర్ అన్నారు. గతంలో శిక్షణ తీసుకున్న వారు మంచి ర్యాంకులు సాధించారన్నారు. ఇప్పుడు శిక్షణ తీసుకున్న వారు కూడా ఈనెల 24న జరిగే ప్రవేశ పరీక్షలో మెరుగైన ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య టీచర్స్ అసోసియేషన్ ప్రతినిదులు పాల్దే ప్రసాద్, హరీష్, సురేష్, భాస్కర్‌రావ్, గుండా వామన్, రెడ్డిశెట్టి మోహన్, గిరిష్, అనిల్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి నిర్ణేతలుగా జిల్లా వాసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయస్థాయి తైక్వాండో న్యాయ నిర్ణేతలుగా జిల్లా వాసులు చోటు దగ్గించుకున్నారు. ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జోగులాంబ గద్వాల్ జిల్లాలో జరిగినటువంటి జాతీయస్థాయి కొరిగి, పూమ్స్ విభాగాల్లో న్యాయ నిర్ణేతల సెమినార్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో జిల్లాకు చెందిన తైక్వాండో మాస్టర్ అన్నారపు వీరేష్, శృతివీరేష్, కన్య మాధవి గొంగళి శివకుమార్, వనిత రాథోడ్‌లు జాతీయ న్యాయ నిర్ణేతలుగా ఎంపికయ్యారు. అనంతరం శివకుమార్, డేగే సాత్విక్, వనిత రాథోడ్, విరాజ్ తేజలు బ్లాక్ బెల్ట్ పరీక్షలో పాల్గొని బ్లాక్ బెల్ట్ డాన్-1 బెల్ట్ సాధించారు.

## కరెంటు తీగలు తగిలి వరి గడ్డి దగ్ధం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడలో కుద్బుద్దీన్ అనే రైతు, తన వరి పొలంలో నుంచి వరి కట్టలను ట్రాక్టర్లో తీసుకొని వెళ్తుతుండగా, ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌లో ఉన్న వరి కట్టలు విద్యుత్ తీగలకు తగిలి మంటలు చెలరేగాయి. వరి కట్టలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న జన్నారం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. గ్రామకార్యదర్శి శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో పరిస్థితిని సమీక్షించారు. దాదాపు 30 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## ఆదివాసులపై అక్రమ కేసులు ఎత్తి వేయాలి

నవతెలంగాణ-జన్నారం

ఆదివాసీ, గిరిజనులపై అటవీ అధికారులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఉపాధి హామీ కూలీల సంఘం మహిళా రాష్ట్ర కన్వీనర్ పద్మ డిమాండ్ చేశారు. మండలంలోని తపాలాపూర్ గ్రామంలో అటవీ అధికారులు అరెస్ట్ చేసిన ఆత్రం రాజును బుధవారం ఆమె కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అడవిని నమ్ముకొని జీవిస్తున్న కొలాం గిరిజనులపై అటవీ అధికారులు అక్రమ కేసులు పెడితే సహించేది లేదన్నారు. ఆదివాసీ గిరిజనుల పట్ల అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలు దాడులు ఆపాలన్నారు. లేనిపక్షంలో ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండగుర్ల లింగన్న, సీఐటీయూ నాయకులు కూకటికారి బుచ్చన్న, లక్ష్మణ్, పాల్గొన్నారు.

## ఆర్టీసీ రిటైర్డ్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా కలవేని శంకర్

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల రిటైర్డ్ ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికలు బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించగా రీజినల్ గౌరవ అధ్యక్షుడిగా కలవేని శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ మాట్లాడుతూ ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యే దిశ గా చర్యలు తీసుకుంటామన్నారు. వారికి రావాల్సిన బెన్ఫిట్స్ సకాలంలో అందే విధంగా అలాగే చాలి చాలని పెన్షనను పెంచే విధంగా ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మేకల దాసు, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.